PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 215 | విజయవాడ, శనివారం 8 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 8 March 2025 | Rs

ఎల్ఐసి అత్యంత బలమైన బ్రాండ్

- బీమా రంగంలో ప్రపంచంలోనే 3వ స్థానం
- విలువలో ఎస్‌బిఐ లైఫ్‌కు 76వ ర్యాంక్
- బ్రాండ్ ఫైనాన్స్ రిపోర్ట్

3

ప్లే-ఆఫ్ రేసులోకి గుజరాత్

- మెరిసిన హర్లిన్ డియోల్
- ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

6

పునర్విభజన ప్రక్రియపై సమైక్య పోరు!

చేతులు కలపాలని కోరుతూ దక్షిణాది, తూర్పు రాష్ట్రాల సిఎంలకు స్టాలిన్ లేఖ



చెన్నై : లోక్‌సభా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిస్తూ సమైక్య ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు కలిసి రావాల్సిందిగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ దక్షిణాది, తూర్పు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. వచ్చే జనాభా లెక్కల ప్రకారం ఆ ప్రక్రియను అమలు చేసినట్లైతే జనాభా పెరుగుదలను విజయవంతంగా నియంత్రించిన రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం గణనీయంగా బలహీనపడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం పలువురు ముఖ్యమంత్రులకు, మాజీ ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ఈ పునర్విభజన ప్రణాళికలు సమాఖ్యవాదంపై దాడి అని ఆయన అభివర్ణించారు. భారతదేశ ప్రజాస్వామ్య స్ఫూర్తి అంతా దాని సమాఖ్య స్వభావంపైనే ఆధారపడి వుందని, ఈ వ్యవస్థలో ఒక దేశంగా వుండాల్సిన మన పవిత్ర ఐక్యతా భావనను గౌరవిస్తూనే ప్రతి ఒక్క రాష్ట్రానికి తన వాణిని వినిపించే హక్కు వుందని స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ సమతుల్యతకు ఇప్పుడు తీవ్రమైన ముప్పు ఏర్పడుతోందని, మన దేశ భవిష్యత్తును రూపుదిద్దడంలో తమిళనాడు వంటి రాష్ట్రాల ప్రాబల్యం శాశ్వతంగా తగ్గిపోవడానికి ఇది దారితీస్తోందని ఆయన పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి అన్ని పార్టీలు కూడా తమిళనాడు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోయే పరిస్థితులపై అఖిలపక్షంలో ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్రానికి తీర్మానం పంపిన నేపథ్యంలో స్టాలిన్ లేఖ వెలువడింది. తమిళనాడుకు సీట్ల సంఖ్య తగ్గిపోతుంటే, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలకు వారి జనాభా దామాషాను బట్టి ప్రాతినిధ్యం పెరుగుతందని స్టాలిన్ పేర్కొన్నారు. పునర్విభజన జరుగుతుందా? లేదా? అనేది ఇప్పుడు ప్రశ్న కాదని, కానీ మన జాతీయ ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్లిన రాష్ట్రాలు అందించిన సేవలను ఎప్పుడు గుర్తిస్తారనేది ఇక్కడ ప్రశ్న అని స్టాలిన్ పేర్కొన్నారు. పునర్విభజనకు తాము వ్యతిరేకం కాదని, కానీ జాతీయ కర్తవ్యాలను విజయవంతంగా మిగతా 7లో

భారీ టూరిజం ప్రాజెక్టులకు సర్వహక్కులతో భూమి!

'కేటాయింపుల' పాలసీకి సర్కారు ఆమోదం

- సచివాలయ ఉద్యోగులే లక్ష్యంగా రేషనలైజేషన్
- మంత్రివర్గ నిర్ణయాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

భారీ టూరిజం ప్రాజెక్టుల (లార్జి, మెగా, అల్ట్రా మెగా) ఏర్పాటుకు ముందుకొచ్చే కార్పొరేట్ సంస్థలకు సర్వహక్కులతో (ఫ్రీ హోల్డ్ ప్రాతిపదికన) భూములను అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రత్యేకంగా రూపొందించిన 'టూరిజం ల్యాండ్ అలాంట్‌మెంట్ పాలసీ-2024'ను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో టూరిజం ప్రాజెక్టులకు భూముల కేటాయింపుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ పాలసీ చర్చకు వచ్చినట్టు సమాచారం. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండటంతో కేబినెట్ నిర్ణయాలను అధికారికంగా ప్రకటించలేదు. ప్రజాశక్తి సేకరించిన సమాచారం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన టూరిజం పాలసీకి కొనసాగింపుగా తాజా భూ కేటాయింపుల పాలసీని రూపొందించారు. టూరిజం ప్రాజెక్టుల కోసం ఎటువంటి వివాదాలే లేని భూమిని (ఎన్‌కంబరెన్స్ ఫ్రీ) భూమిని ఇవ్వాలని టూరిజం పాలసీలో పేర్కొనగా, తాజాగా భూ కేటాయింపుల పాలసీలో ప్రాజెక్టుల వారీగా ఎన్ని ఎకరాలు కేటాయించాలి, ఏ పద్ధతిలో కేటాయించాలన్న విషయాలను పేర్కొన్నారు. 50 కోట్ల రూపాయల నుండి 250 కోట్ల రూపాయల వరకు పెట్టుబడులతో వచ్చే టూరిజం ప్రాజెక్టులను లార్జ్ ప్రాజెక్టులుగాను, 250-నుండి 500 కోట్ల రూపాయల పెట్టుబడులను మెగా, 500 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులతో వచ్చే వాటిని అల్ట్రామెగా ప్రాజెక్టులుగా విభజించారు. ఈ మూడు తరహా ప్రాజెక్టులకు లీజు లేదా ఫ్రీ హోల్డ్ ప్రాతిపదికన భూములు కేటాయించాలని తాజా పాలసీలో పేర్కొన్నప్పటికీ, కార్పొరేట్ సంస్థలు ఎటువైపు మొగ్గుచూపుతాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అలాగే ఈ తరహా సంస్థలకు 66+33 సంవత్సరాల పాటు భూమిని కేటాయించాలని పాలసీలో పేర్కొన్నప్పటికీ ఫ్రీ హోల్డ్ ప్రాతిపదక ఒకసారి అప్పగించిన తరువాత కాల వ్యవధికి పెద్దగా విలువ లేదని, సర్వ హక్కులు ఆ సంస్థలకు దఖలు పడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే విధంగా ఏ తరహా టూరిజం ప్రాజెక్టుకు ఎన్ని ఎకరాలు భూమిని కేటాయించాలన్నది కూడా ఈ పాలసీలో పేర్కొన్నారు. అయితే, భారీ పెట్టుబడులతో వచ్చే కార్పొరేట్ సంస్థలకు చేసే భూ కేటాయింపులపై ఎటువంటి పరిమితి విధించలేదు. 'ప్రభుత్వం నిర్ణయించిన విధంగా' అని పాలసీలో పేర్కొన్నారు. ఎంఎస్ఎంఇ ప్రాజెక్టులకు బిడ్డింగ్ ప్రాతిపదికన భూములు కేటాయించాలని, భారీ ప్రాజెక్టులకు వారు కోరుకున్న మిగతా 7లో

కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రాజెక్టు రకం	కేటాయించే భూమి (ఎకరాల్లో)
వే సైడ్ ఎమినిటీస్	1-3
మల్టిప్లెక్స్	2-3
టెంట్ సిటీస్	5
హోటల్స్	5
ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్స్	5
మైస్ సెంటర్స్	10
ఇతర ప్రాజెక్టులు	10
రిసార్ట్స్	15
థీమ్ పార్కులు	5
గోల్ఫ్ కోర్సులు	150
మెగా,అల్ట్రామెగా	ప్రభుత్వ నిర్ణయం మేరకు

ప్రాజెక్టుల ప్రత్యేకతలను బట్టి అదనపు భూమిని కూడా కేటాయించవచ్చు

72లక్షల మందికి 'తల్లికి వందనం'

- మండలిలో మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమాన్ని 72లక్షల మంది విద్యార్థులకు అందించనుందని ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు శాసనమండలిలో శుక్రవారం ఆయన సమాధానం చెబుతూ గత వైసిపి ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని 43లక్షల మందికే అమలు చేసిందన్నారు. తమ లెక్కల ప్రకారం 72లక్షల మంది విద్యార్థులు అర్హులుగా ఉన్నట్లు తేలిందని చెప్పారు. వీరందరికి పథకం ప్రయోజనాలు అందిస్తామన్నారు. 'అన్నదాతా.. సుఖీభవ' పథకానికి బడ్జెట్‌లో రూ.6300కోట్లు కేటాయించిందని, కేంద్రం నుంచి మరో రూ.3,700కోట్లు వస్తాయని చెప్పారు.ఉచిత గ్యాస్ పథకం కింద రూ.2600కోట్లు కేటాయించామన్నారు. పింఛన్ల కోసం ఏడాదికి రూ.32,520 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ఇవి కాకుండా పాఠశాలలు, ఆస్పత్రులు వంటి సర్వీసులు నిర్వహణ కోసం అదనంగా చెల్లించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా చేసిందని

జీతాలపై స్పష్టత ఇవ్వాలి: ఐ.వి

ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు కోరారు. జీతాలకు 85శాతం ఖర్చు చేస్తున్నట్లు అంతకుముందు ఆర్థికశాఖ మంత్రి చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆ మొత్తం ఆఫీస్ నిర్వహణలు, అన్ని కలిపా? అన్నది వివరించాలన్నారు. సకాలంలో పిఆర్‌సి, డిఎలు చెల్లిస్తామని, ఉద్యోగులకు మెరుగైన పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.ఇచ్చిన హామీకి భిన్నంగా బడ్జెట్‌పై సమాధానం ఇస్తున్నారని చెప్పారు.

టీచర్ల బదిలీల కోసం చట్టం

- వచ్చే క్యాబినెట్‌లో ప్రతిపాదిస్తాం
- ఈ నెలలోనే మెగా డిఎస్‌సి
- శాసనసభలో నారా లోకేష్

రాష్ట్రంలో టాటా పవర్ పెట్టుబడులు

- మంత్రి లోకేష్ సమక్షంలో ప్రభుత్వం ఒప్పందం

2

మత్స్యకారులకు తక్షణమే వేట పరిహారం

- ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్
- కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో సాగిన యాత్ర

కాకినాడలో సుందరయ్య భవన్ నుంచి ప్రారంభమయిన సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, తాళ్లరేవు

మత్స్యకారులకు తక్షణమే వేట నిషేధ పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర శుక్రవారం కాకినాడలోని సుందరయ్య భవన్ వద్ద ప్రారంభమైంది. ఈ యాత్రలో వి.శ్రీనివాసరావుతో పాటు జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, నాయకులు హరిబాబు, ఎం.రాజశేఖర్, క్రాంతి, వి.రాజబాబు, రాజా తదితరులు పాల్గొన్నారు. యాత్ర కాకినాడ రూరల్ మండలం తూరంగి మీదుగా తాళ్లరేవు మండలం చొల్లంగి, చొల్లంగి పేట, మట్లపాలెం తదితర ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దళితవాడలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి ఇబ్బందులను సిపిఎం బృందం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఉపాధి కార్మికులతో మాట్లాడినప్పుడు పనికి తగ్గ వేతనాలు రావడం లేదని, పూర్తిస్థాయిలో పనులు కల్పించడం లేదని కార్మికులు చెప్పుకొచ్చారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వి.శ్రీనివాసరావుకు మత్స్యకారులు అందించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాకినాడ తీరంలో పది వేల మత్స్యకార కుటుంబాలు సముద్రంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. చమురు కంపెనీలు అందించే పరిహారంతో పాటూ వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ఇచ్చే పరిహారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం పోరాడుతామని, అందులో భాగంగానే సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలను చేపట్టామని వి.శ్రీనివాసరావు అన్నారు. సైకిల్ యాత్ర ప్రారంభమైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... సైకిల్ యాత్ర తాళ్లరేవు మండలంలో రెండు రోజుల పాటు సాగుతుందన్నారు. వివిధ గ్రామాల్లో పర్యటించి, ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మండలాల్లో, పట్టణ ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహిస్తామన్నారు. ప్రజలను చైతన్యపరుస్తూ తమ యాత్రలు 17 వరకు జరుగుతాయన్నారు. ప్రజలంతా తమ సమస్యలను సిపిఎం బృందాల దృష్టికి తీసుకు రావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుంచి 28 వరకు వివిధ రూపాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోతే ఏప్రిల్, మే నెలల్లో సమరశీల పోరాటానికి సిద్ధమవుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు గడిచినా ఉపాధి కల్పనపై చిత్తశుద్ధి లేదన్నారు. కరెంట్ ఛార్జీల భారాలు విపరీతంగా వేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ గురించి గొప్పగా చెప్పడం తప్ప అమలు చేయలేదన్నారు. పైగా ఉన్న సంక్షేమ పథకాలకు కోత విధిస్తున్నారని విమర్శించారు.

జిల్లాల పునర్విభజన ఇప్పట్లో లేనట్లే...!

- ప్రతిపాదనలు లేవన్న ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిల్లాల పునర్విభజన ఇక ఇప్పట్లో లేనట్లేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి సిసిఎల్ఎ పరిశీలనలో ఎటువంటి ప్రతిపాదనలు లేవని ప్రభుత్వం శాసనమండలిలో తెలిపింది. జిల్లాల ఏర్పాటుపై శాసనమండలిలో శుక్రవారం పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిస్తూ కొత్తగా రెండు రెవెన్యూ డివిజన్లకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. అందులో బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల , రేపల్లె మూడు రెవెన్యూ డివిజన్లను సవరించి అద్దంకి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఆ జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదన వచ్చిందన్నారు, సత్యసాయి జిల్లాలోని మడకశిరను రెవెన్యూడివిజన్‌గా మార్చాలంటూ ఆ జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయని తెలిపారు. ఈ రెండు రెవెన్యూ డివిజన్లను ప్రభుత్వం పరిశీలిస్తోందని, జిల్లాల పునర్విభజనకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు లేవని చెప్పారు.

కోస్తాలో నేటి నుంచి పి-4 సర్వే

- రాయలసీమ, నెల్లూరు, ప్రకాశంలో 90 శాతం పూర్తి
- మండలి ఎన్నికల కోడ్‌తో వాయిదాపడిన జిల్లాల్లో తిరిగి ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే కోస్తా జిల్లాల్లో శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఉమ్మడి గుంటూరు నుంచి శ్రీకాకుళం వరకు శాసన మండలి ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో గత నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు నిర్వహించేందుకు అవకాశం దక్కలేదు. ఎన్నికలకోడ్ ముగియడంతో శనివారం నుంచి ఈ సర్వే నిర్వహించాలని ఆయా జిల్లాల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈనెల 8 నుంచి 18 వరకు సర్వే నిర్వహించి 25 కల్లా పూర్తిస్థాయి నివేదిక ప్రభుత్వానికి అందించాలి.

రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో సర్వే గత నెలలో చేపట్టారు. మొత్తం ఆరు ఉమ్మడి జిల్లాల్లో 51,88,703 నివాసితులు ఉండగా 49,34,569 ఇళ్లలో సర్వే చేపట్టారు. వివరాలు చెప్పడానికి 42,33,956 కుటుంబాలు అంగీకరించాయి. మిగతా వారి వివరాలు పూర్తిగా నమోదు కాలేదు. అలాగే 2,54,134 కుటుంబాలకు సర్వే ప్రస్తుతం కొనసాగుతోంది. ప్రభుత్వం నమోదు చేస్తున్న సర్వే వల్ల తమకు అందుతున్న వివిధ సంక్షేమ పథకాలు రద్దు అవుతాయోమోనన్న భయంతో చాలా మంది వివరాలు పూర్తిగా ఇవ్వడంలేదని అధికార వర్గాలు తెలిపాయి. 20 శాతం మంది పేద, నిరుపేదలను గుర్తించి వారిని జనాభాలో పది శాతం వరకు ధనికులు దత్తత తీసుకుని వారి అభ్యున్నతికి పలు కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందని అధికారులు తెలిపారు. పి-4 పై సిఎం చంద్రబాబు ఉగాది రోజున పూర్తిస్థాయిలో నూతన విధానం ప్రకటించనున్నారు.

సర్వేకు సంబంధించి ప్రభుత్వం తగిన మార్గదర్శకాలను జారీ చేసింది. సర్వేను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు నిర్వహించనున్నారు. పేదరికంలో ఉన్న జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు ఆన్‌లైన్‌లో పంపింది. ఈ జాబితా ఆధారంగా ఆయా ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పేదరికంలో ఉన్నారా? లేదా? అన్న విషయాన్ని నమోదు చేస్తారు. ఇందుకు పలు ప్రమాణికాలను ప్రకటించింది. ప్రధానంగా పట్టణాల్లో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం, ప్రభుత్వ ఉద్యోగం, ఆదాయ పన్ను, జిఎస్‌టి రిటర్నులు, సొంత ఆస్తి, మిగతా 7లో

నాగబాబు నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికకు కూటమి అభ్యర్థిగా కొణిదెల నాగబాబు తొలి నామినేషన్ దాఖలు చేశారు.

శాసనసభ భవనంలో రిటర్నింగ్ అధికారి, శాసనమండలి ఉపకార్యదర్శి ఆర్ వనితారాణికి శుక్రవారం నామినేషన్ పత్రాలతో పాటు బి ఫారమ్, అఫిడవిట్, సెక్యూరిటీ డిపాజిట్‌ను అందజేశారు. నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం 173(ఎ) ప్రకారం ఆయనతో రిటర్నింగ్ అధికారి ప్రతిజ్ఞ చేయించారు. సహాయ రిటర్నింగ్ అధికారులు, శాసనసభ సహాయ కార్యదర్శులు ఆర్ శ్రీనివాసరావు, ఎం. ఈశ్వరరావు నామినేషన్ పత్రాల పరిశీలనలో రిటర్నింగ్ అధికారికి సహకరించారు. నామినేషన్ దాఖలు సందర్భంలో నాగబాబుతో పాటు మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కొణాతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు హాజరయ్యారు.

వెటర్నరీ విద్యార్థుల పోరుబాట

- స్టైఫండ్ పెంపు కోసం ఆందోళనలు
- 32 రోజులుగా కొనసాగుతున్న నిరసనలు

అలిపిరి మెట్ల వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, ఎస్‌వియు క్యాంపస్

రాష్ట్రవ్యాప్తంగా వెటర్నరీ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. రూ.20 వేలు స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తిరుపతి ఎస్‌వి వెటర్నరీ యూనివర్సిటీతో పాటు నెల్లూరు జిల్లా పొదలకూరు, వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరు, కృష్ణా జిల్లా గన్నవరం, విజయనగరం జిల్లా గరివిడిలో 32 రోజులుగా వెటర్నరీ విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోగా విద్యార్థులపై క్షకసాధింపు చర్యలకు పాల్పడింది. ఎస్‌వి వెటర్నరీ యూనివర్సిటీ మెస్‌కు తాళాలు వేసింది. దీంతో విద్యార్థులు ఆందోళన తీవ్ర స్థాయికి చేరింది. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు యూనివర్సిటీ యాజమాన్యం చేరుకుని.. సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం మెస్‌ను ఓపెన్ చేశారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని విద్యార్థులు తేల్చిచెప్పారు. సిఎం నిర్ణయం తమకు సానుకూలంగా వస్తుందో లేదోనని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఐదు కళాశాలలో సుమారు 1500 మంది విద్యార్థులు పశువైద్య విద్యను అభ్యసిస్తున్నారు. బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండరీ (బివిఎస్‌సి, ఎహెచ్) కోర్సు వ్యవధి 5.5 సంవత్సరాలు. చివరి సంవత్సరం ఇంటర్న్‌షిప్‌లో భాగంగా కళాశాల నుంచి సుదూర ప్రాంతాలలోని ప్రాథమిక పశువైద్య ఆరోగ్య కేంద్రాలలో కొంతకాలం పనిచేయవలసి ఉంటుంది. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం వారికి ప్రతి నెల రూ.ఏడు వేల రూపాయలు స్టైఫండ్‌ను ఇస్తుంది. అది కూడా మూడు నెలలకు, ఆరు నెలలకు ఒకసారి ఇస్తుందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. అయితే గత 13 సంవత్సరాల కాలంలో ఇతర వైద్య కోర్సులైనటువంటి ఆయుష్, బిడిఎస్, ఆయుర్వేద కోర్సులకు మిగతా 7లో

వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ

2



విద్యా రంగంలో సంస్కరణలు రావాలి

- 'సిద్ధార్థ' స్వర్ణోత్సవాల ప్రారంభ సభలో యుజిసి చైర్మన్ జగదీశ్ కుమార్

5

పంటలకు మద్దతు ధర కల్పించాలి

- అన్ని పంటలనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్
- 'అనంత'లో రైతుసంఘం పాదయాత్ర ప్రారంభం

2

ఉచిత బస్సుపై ఆంక్షలు తగదు

- ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లా పరిధికే పరిమితం అని మంత్రి చేసిన ప్రకటన మహిళలను తీవ్ర నిరాశకు గురి చేసిందని, ఇది వాగ్ధానాన్ని వమ్ము చేయడమేనని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఈ పథకాన్ని అమల్జేస్తామని ఊరిస్తున్నారనే మినహా ఎప్పటి నుంచి అమల్జేస్తారనే స్పష్టత ఇవ్వడం లేదన్నారు. మహిళలకు రాష్ట్ర పరిధిలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ, తక్షణమే ఈ పథకాన్ని అమలు చేయాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే తప్ప దూర ప్రాంతాలకు మహిళలు ప్రయాణించరని, జిల్లాలకే పరిమితం చేస్తూ ఆంక్షలు విధిస్తే... కొన్ని ప్రాంతాల్లో పక్క ఊరికి వెళ్లాలన్నా వేరే జిల్లాకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఉచిత బస్సు పథకం మహిళలకు అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుస్తున్నట్లు తమిళనాడులో ఒక అధ్యయనంలో వెల్లడైందని చెప్పారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల తరహాలో మన రాష్ట్రంలో కూడా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి ప్రయాణించినా ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

నిమ్మలపై లోకేష్ వ్యాఖ్యలతో సభలో నవ్వులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పనిపైనే కాకుండా కాస్త ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సలహా ఇచ్చారు. శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి నిమ్మల బాధపడుతున్న విషయాన్ని లోకేష్ ప్రస్తావిస్తూ రామానాయుడు విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజును కోరడంతో సభలో నవ్వుల పువ్వులు విరిశాయి. అంతేకాకుండా 'మీరు విశ్రాంతి తీసుకుంటారా లేక సభనుంచి సస్పెండ్ చేయించమంటారా?' అంటూ లోకేష్ చమత్కరించారు. అనంతరం అసెంబ్లీ లాబీల్లో రామానాయుడు ఎదురుపడగానే ఆయన ఆరోగ్యంపై లోకేష్ ఆరా తీశారు. ఒక చేతికి సైలైన్ ఇంజెక్షన్ పెట్టించుకుని మరోచేతితో కాగితాలు పట్టుకుని తిరుగుతూనే ఉంటే ఆరోగ్యం ఏమి కావాలని లోకేష్ ఆప్యాయంగా పలుకరించారు. నిన్నటి కంటే ఈ రోజు ఆరోగ్యం బాగానే ఉందని అందుకే సభకు వచ్చానని రామానాయుడు తెలిపారు.

నోటీసులు ఇచ్చాకే పోసాని విచారణ

- పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

ప్రజాశక్తి, అమరావతి

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల కేసులో పోసాని మురళీ కృష్ణకు బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు జారీ చేశాకే విచారణ చేయాలని విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, మీడియా సంస్థల ప్రతినిధులపై అనుచిత పోస్టులు పెట్టారంటూ నమోదైన కేసును కొట్టేయాలంటూ పోసాని వేసిన పిటిషన్‌లో జస్టిస్ నూనెపల్లి హరినాథ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పిటి వారెంట్ అమలు కాలేదని పోలీసుల తరపు న్యాయవాది చెప్పడంతో సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

మహిళా టీచర్‌పై పిజిటి దాడి

- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- హెచ్‌ఎం, పిజిటి సస్పెన్షన్

ప్రజాశక్తి-వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారు.. పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేయాల్సిన ఉపాధ్యాయులే ఘర్షణకు దిగారు. మహిళా టీచర్లపై పిజిటి (పోస్టు గ్రాడ్యుయేట్) ఉపాధ్యాయుడు దుర్భాషలాడి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన వైఎస్ఆర్ జిల్లా వేంపల్లెలోని తల్లిశెటి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. తోటి మహిళా ఉపాధ్యాయుల వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం పిజిటి గురునాథ్‌రెడ్డి తన కారును వేగంగా నడుపుకుంటూ పాఠశాలకు వచ్చాడు. పాఠశాల ఆవరణంలో మహిళా ఉపాధ్యాయులకు దగ్గరగా కారును పోనిచ్చాడు. దీంతో వారు గురునాథ్‌రెడ్డిని ప్రశ్నించారు. తోటి మహిళా ఉపాధ్యాయులను అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేశాడు. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి షంషీద్దీన్, డిప్యూటీ డిఇఒ మీనాక్షి... వేంపల్లెలోని పాఠశాలకు వచ్చి జరిగిన విషయంపై విచారణ చేపట్టారు. హెచ్‌ఎం ప్రోత్సాహంతో పిజిటి తీవ్ర అనుచిత ప్రవర్త ప్రదర్శించినట్లు విచారణలో తెలిందని డిఇఒ చెప్పారు. క్రమ శిక్షణ చర్యలో భాగంగా గురునాథ్‌రెడ్డిని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం నారాయణమ్మను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషీద్దీన్ తెలిపారు.

రాష్ట్రంలో టాటా పవర్ పెట్టుబడులు

మంత్రి లోకేష్ సమక్షంలో ప్రభుత్వం ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటేడ్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ ఒప్పందాలు శుక్రవారం జరిగాయి. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో ఈ ఒప్పందాలపై నెడ్‌క్యాప్ ఎండి కమలాకర్, టాటా ఎనర్జీ సిఇవో, ఎండి దీపేష్ నందా సంతకాలు చేశారు. టాటా ఎనర్జీ, నెడ్‌క్యాప్ సంయుక్తంగా 7వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ఐదేళ్లల్లో ఏర్పాటు చేయనున్నాయి. ఈ ఒప్పందం ద్వారా రూ.49వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తునానరు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఈ ఒప్పందం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల పునరుత్పాకద విద్యుత్ సామర్థ్యంతో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాలనేది తమ లక్ష్యమని చెప్పారు. హరిత ఇంధనాన్ని విస్తరణను వేగవంతం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. టాట ఎనర్జీ కంపెనీ ఏర్పాటు చేసే ప్రాజెక్టులకు అవసరమైన భూముల గుర్తింపు, మౌలిక సదుపాయాల కల్పనకు నెడ్‌క్యాప్ మద్దతునిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, నెడ్‌క్యాప్ జనరల్ మేనేజర్ కె శ్రీనివాస్, టాటా ఎనర్జీ ప్రతినిధులు అమిత్ మిమానీ, తాహేర్ లోకానంద్ వాలా తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న టాటా, ప్రభుత్వ ప్రతినిధులు

వాద్వానీ ఫౌండేషన్‌తో మరో ఒప్పందం

కృత్రిమ మేధ ఆధారిత సర్వీస్ డెలివరీ ట్రాన్స్‌ఫర్మేషన్, పాలసీ మేకింగ్, కెపాసిటీ బిల్డింగ్ వంటి అంశాలపై వాద్వానీ ఫౌండేషన్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, వాద్వానీ సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సిఇవో ప్రకాష్‌కుమార్‌లు మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఏఐ ఆధారిత పాలసీ ఫ్రేమ్ వర్క్ నిర్మించేందుకు, సర్వీస్ డెలివరీని మెరుగుపరిచేందుకు, అధునాత డిజిటల్ నైపుణ్యాలతో కూడిన శ్రామిక శక్తిని నిర్మించడానికి ఈ ఫౌండేషన్ సహరిస్తుందని మంత్రి లోకేష్ చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చూస్తాం

అసెంబ్లీలో హెల్త్ పద్దుపై చర్చ సందర్భంగా మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చూస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. విలేజి క్లినిక్ మొదలుకొని జిజిహెచ్‌లు, బోధన కాలేజీల వరకు డాక్టర్లు, సిబ్బంది, నర్సుల ఖాళీలు ఉన్న మాట వాస్తవమన్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి ఇంకా ఎక్కువ నిధులు అవసరమవుతాయన్నది తన అభిప్రాయమని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పద్దుపై శాసనసభలో శుక్రవారం చర్చ జరిగింది. అధికార కూటమి పార్టీలకు చెందిన పలువురు సభ్యులు చర్చలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యుల సందేహాలు, ప్రశ్నలపై మంత్రి సమాధానమిస్తూ... వైద్య ఆరోగ్యశాఖకు ముఖ్యమంత్రి చాలా ఎక్కువ నిధులే కేటాయించారు. అయినా అవి సరిపోవు. మరిన్ని నిధులివ్వాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.750 కోట్లతో మందులు సరఫరా చేస్తున్నాం. మందుల కొరత రానీకుండా చూస్తాం. 300 అంబులెన్స్‌లకు కాలపరిమతి ముగిసింది. కొత్తగా 190 అంబులెన్స్‌లను కొంటున్నాం. అలాగే కొత్తగా 53 మహాప్రస్థానం వాహనాలూ కొంటున్నాం. ఎన్‌టిఆర్ వైద్య సేవ కిందకు దారిద్య్రరేఖకు దిగువనున్న కుటుంబాలతో పాటు అల్పాదాయ, మధ్యతరగతికి చెందిన 22 లక్షల కుటుంబాలను చేరుస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో రూ.250 కోట్లతో 5 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తున్నాం. హెల్త్‌కేర్‌లో కేరళ మొదటి స్థానంలో ఉంది. మనం కాస్త వెనకబడి ఉన్నాం. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యానికనుగుణంగా ఆరోగ్య, సంతోష రాష్ట్రాన్ని తయారు చేస్తాం... అని అన్నారు. ఆశా వర్కర్ల పోరుబాటపై మంత్రి మాట్లాడుతూ... ఆశా వర్కర్లకు ఈ రాష్ట్రంలోనే ఎక్కువ జీతం ఇస్తున్నాం. తెలంగాణాలో రూ.7,500. కానీ సిఐటియు వాళు ఆందోళనలు చేస్తున్నారు. ఆశాలకు గ్రాట్యుటీ రూ.లక్షన్నర, ప్రసూతి సెలవులు ఇద్దరు పిల్లలకు మొత్తం ఆర్నెల్లు, వయోపరిమితి రెండేళ్ల పెంపునకు సిఎం నిర్ణయించారు... అని మంత్రి తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ పద్దుకు సభ ఆమోదం తెలిపింది.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారాలి : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, ఇందుకు తమ ప్రభుత్వం ప్రోత్సాహాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎలిప్, ఎంఎస్‌ఎంఇ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని ఒక హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, మహిళల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచడం, సాంకేతికత వినియోగం, నూతన ఆవిష్కరణలతో ఆర్థికంగా వృద్ధి సాధిస్తారని వివరించారు. మహిళలు ఇప్పుడు సంపాదనలో పురుషుల కంటే మెరుగ్గా రాణిస్తున్నారని, వారి అపారమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారని చెప్పారు. టిడిపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉందన్నారు. మహిళలకు భారాన్ని తగ్గించడానికి దీపం 2.0లో భాగంగా ఏడాదిలో 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. దేశంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించిందన్నారు. బ్యాంక్ లింకేజితో రుణాలు అందించి స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో మహిళా సాధికారతకు కృషి చేస్తున్నామని తెలిపారు. వ్యాపార ఆలోచన ఉన్న ఏ మహిళకైనా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నుంచి నిర్మాణాత్మకమైన మద్దతు లభిస్తోందని చెప్పారు. ఈ సదస్సులో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీ శా తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

- అన్ని పంటలనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్
- 'అనంత'లో రైతుసంఘం పాదయాత్ర ప్రారంభం

పాదయాత్రను ప్రారంభిస్తున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ (అనంతపురం)

రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మద్దతు ధరకు పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర అనంతపురం జిల్లా ఉరవకొండ మండల కేంద్రంలో శుక్రవారం ప్రారంభమైంది. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్ అధ్యక్షతన చేపట్టిన పాదయాత్రను రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మొదటిరోజుఉరవకొండ నుంచి ప్రారంభమైన యాత్ర చిన్నముష్టూరు, కోనాపురం గ్రామాల మీదుగా పెన్నఅహోబిలం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని విమర్శించారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికందకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సాగు చేసిన అన్ని పంటలకూ మద్దతు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం, ఇన్సూరెన్స్ విడుదల చేయాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి డబ్బి, కడ్డీ రకానికి క్వింటాలు రూ.50 వేలు, సీజెంటా ఇతర రకాల మిరపను రూ.25 వేలు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాలు రూ.10 వేలతో కొనుగోలు చేయాలని, రైతుల వద్ద నిల్వ ఉన్న పత్తి పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. ఉరకొండ ప్రాంతంలో మిరప, పప్పుశనగ రైతులు గిట్టుబాటు ధరల లేక నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారని, వీరి సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించాలని కోరారు. ఈ పాదయాత్రలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సిఐటియు నాయకులు వి.రామిరెడ్డి తదితులు పాల్గొన్నారు.

బిఇడి ప్రశ్నా పత్రం లీక్

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని బిఎడ్ కళాశాలల్లో గురువారం నుంచి ప్రారంభమైన బిఇడి మొదటి సెమిస్టర్ పరీక్షలు తొలిరోజు సజావుగా జరిగినా రెండవ రోజు పేపర్ లీకేజీ అంశం సంచలన సృష్టించింది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రాస్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్‌మెంట్ అనే పరీక్ష జరగాల్సి ఉండగా అర గంట ముందుగానే ప్రశ్నా పత్రం వాట్సప్ గ్రూపులో రావడంతో కొంతమంది ఈ విషయాన్ని సంబంధిత పరీక్ష కేంద్రాల నిర్వాహకులకు తెలిపారు. వారు తమకు యూనివర్సిటీ నుంచి సమాచారం అందలేదని, ప్రస్తుతం పరీక్ష రాయాలని ఆదేశించినట్లు సమాచారం. ప్రశ్నా పత్రం లీకేజీపై పిజి అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ ఎం.సుబ్బారావును వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

విద్యాశాఖ మంత్రి సీరియస్

ప్రశ్నా పత్రం లీకేజీపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఆ పరీక్షను రద్దు చేస్తామని ప్రకటించారు. పరీక్షల నిర్వహణలో లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లీకేజీ విషయాల్లో పాత్రధారులపై తగిన చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియాలో ప్రకటించారు.

క్షత్రియుల అభివృద్ధికి కృషి : కార్పొరేషన్ ఛైర్మన్ సూరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్షత్రియులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎపి క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణరాజు (కనకరాజు సూరి) అన్నారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. క్షత్రియ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు కార్పొరేషన్ ఎండి మహేశ్వర రెడ్డి ఛైర్మన్, డైరెక్టర్లతో పదవీ ప్రమాణం చేయించారు. ఛైర్మన్‌తో పాటు కార్పొరేషన్ డైరెక్టర్లు కూడా ప్రమాణం చేశారు.

టీచర్ల బదిలీల కోసం చట్టం

- వచ్చే క్యాబినెట్‌లో ప్రతిపాదిస్తాం
- ఈ నెలలోనే మెగా డిఎస్‌సి
- శాసనసభలో నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధ్యాయల బదిలీలను సక్రమంగా నిర్వహించేందుకు త్వరలో చట్టం తీసుకురానున్నట్లు రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయపోస్టుల భర్తీ, కరిక్యులమ్‌లో మార్పులు,మౌలిక సదుపాయాలపై అనకాపల్లి శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి శాసనసభలో శుక్రవారం జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. పారదర్శకంగా బదిలీల ప్రక్రియ నిర్వహించడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని వచ్చే క్యాబినెట్ సమావేశం ముందుకు తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. ఆ చట్టం అమలులోకి వస్తే బదిలీల కోసం ఎవరి వద్దకు పైరవీలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా టీచర్ల సీనియారిటీ లిస్టును పబ్లిష్ చేస్తున్నట్లు మంత్రి చెప్పారుజ సాదారణంగా సీనియార్టి లిస్టులు గందరగోళంగా ఉంటాయని, ఈ సారి తాము ప్రకటించిన లిస్టుల్లో తప్పులు ఉంటే డిఇఓ వద్దకు వెళ్ళి సరిచేసుకోవచ్చన్నారు.

సిబిఎస్ఇ మోడల్ మాక్ ఎగ్జామినేషన్ పెడితే 90శాతం మంది విద్యార్థులు ఫెయిలయ్యారని, ఇందులో బాలికలు ఫెయిల్ అయితే ఆ ప్రభావం సామాజిక సమస్యగా తలెత్తుతుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, పిల్లలను సిద్ధం చేసి మూడేళ్ల తర్వాత సిబిఎస్ఇ అమలు చేద్దామని తాను చెప్పినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. ప్రభుత్వ విద్య బలోపేతం కోసం వన్‌క్లాస్- వన్ టీచర్ ఉండాలని తాము భావిస్తున్నామన్నారు. ప్రతి పంచాయితీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. టీచర్ ట్రైనింగ్‌కు వరల్డ్ క్లాస్ ఇనిస్టిట్యూట్ అమరావతిలో పెట్టాలని భావిస్తున్నామని, ఈ విషయంతో మునిసిపల్‌శాఖ మంత్రి నారాయణతో చర్చించినట్లు చెప్పారు. ఈనెలలోనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు లోకేష్ పేర్కొన్నారు.

ఐక్య పోరాటాలతో ఉక్కును కాపాడుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు శ్రీనివాస్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1485వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పోరాడుతున్న కార్మికనేత జె.అయోధ్యరామ్‌కు ప్లాంట్ యాజమాన్యం షోకాజ్ నోటీసు జారీ చేయడాన్ని ఖండించారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్న వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం విజ్ఞప్తి చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం లేఖ రాశారు. లేఖలోని వివరాలు... తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో వెటర్నరీ వైద్య విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిలో ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు భోజనాలు, వసతి నిమిత్తం 2017 సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ స్టయిఫండ్ రూ.7 వేలుగా నిర్ణయించారు. ఈ కాలంలో ధరలు, చార్జీలు, వసతి అద్దె పెరిగాయి. అందుకు అనుగుణంగా స్టయిఫండ్ పెంచలేదు. పెరిగిన ధరలు, చార్జీలు, అద్దెలను బట్టి మెడికల్ విద్యార్థులకు సుమారు రూ.25 వేలు చెల్లించాలని రాష్ట్రంలో అనేక జిల్లాల్లో వెటర్నరీ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నుండి నేటి వరకు 33 రోజులు నుండి కళాశాల వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు అనేకమార్లు విన్నవించారు. కానీ నేటికీ సమస్య పరిష్కరించలేదు. వారు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే తిరుపతి యూనివర్శిటీలో హాస్టళ్లు మూసివేసి బయటికి వెళ్లండని విద్యార్థులను పంపించివేయడం గర్హనీయం. కోర్స్ ఆరు సంవత్సరాలు ఉంటుంది. చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ కాల వ్యవధిలో ఏదైనా రెండు జిల్లాలలో ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రులు, పశు సంరక్షణ కేంద్రాలకు వెళ్లి జంతు ప్రదర్శనశాలలో పనిచేయవలసి ఉంటుంది. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో వీరంతా సేవలు అందిస్తారు. నగరాల్లో, పట్టణాల్లో కాకుండా పూర్తిగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించవలసిన పరిస్థితి ఉంటుంది. ఒరిస్సా రాష్ట్రంలో ప్రస్తుతం స్టయిఫండ్ రూ.14 వేలు చెల్లిస్తున్నారు. కేరళలో రూ.17 వేలు, తమిళనాడులో రూ.18 వేలు రాజస్థాన్ రూ.23 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. మన రాష్ట్రంలో మాత్రం ఇచ్చే స్టైఫండ్ కనీస ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. మీరు స్వయంగా జోక్యం చేసుకొని వారి సమస్యలను పరిష్కారం చేయాలని, విద్యార్థులు కోరుతున్నట్లు స్టయిఫండ్ నెలకు రూ.25 వేలు చొప్పున చెల్లించాలని కోరుతున్నాను.... అని సిఎంకు రాసిన లేఖలో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

'ఆ' మరణం అనుమానాస్పదమే!

- మంత్రివర్గ సమావేశంలో సిఎం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుమానాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో అధికారులు వెళ్లిపోయిన తరువాత మంత్రులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఈ విషయాన్ని సిఎం స్వయంగా ప్రస్తావించినట్లు తెలిసింది. 'రంగన్న మరణంం ముమ్మాటికి అనుమానాస్పదమే' అని సిఎం అన్నట్లు సమాచారం. ఆ తరువాత ఈ అంశంపై దాదాపు గంట సేపు చర్చ జరిగినట్లు తెలిసింది. రంగన్నను పోలీసులే చంపారంటూ తొలుత వచ్చిన వార్తలపై మంత్రులు పలు అనుమానాలను వ్యక్తం చేశారు రాష్ట్రంలో రాజకీయ ముసుగులో నేరస్తులు పెరిగిపోతున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది. వివేకానందరెడ్డి హత్య కేసులోలో కీలక సాక్షులు వరుసగా మరణిస్తుండడాన్ని సీరియస్‌గా తీసుకోవాలని అన్నట్లు సమాచారం.. ఆర్గనైజ్డ్ క్రైమ్ చేయడంలో ఆరితేరిన వారికి అదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ హత్య కేసు సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుసరించిన విధానాలను కూడా సహచర మంత్రులకు చంద్రబాబు వివరించినట్లు తెలిసింది. జగన్, షర్మిల మధ్య జరుగుతున్న కుటుంబ వివాదాలపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది. ఇదే సమయంలో మంత్రివర్గంలో, శాసనసభులపై క్షేత్ర స్థాయిలో వస్తున్న కొన్ని ఆరోపణలపైనా చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఇటువంటి వాటికి దూరంగా ఉండాలని సూచించినట్లు సమాచారం.

9 నెలల్లో రూ.1.06 లక్షల కోట్ల అప్పులు

- వాస్తవికతకు దూరంగా బడ్జెట్
- మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర బడ్జెట్ వాస్తవికతకు దూరంగా ఉందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. శాసనమండలిలో బడ్జెట్‌పై శుక్రవారం ఆయన ప్రసంగించారు. ఆయన ప్రసంగించే సమయంలో పలుసార్లు మంత్రులు అచ్చెన్నాయుడు, బిసి జనార్ధన్ రెడ్డి జోక్యం చేసుకున్నారు. ఇందుకు నిరసనగా వైసిపి సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు బొత్స మాట్లాడుతూ గత ప్రభుత్వాన్ని విమర్శించడం, ముఖ్యమంత్రిని, అతని తనయుడిని పొగడటం వంటివి బడ్జెట్ ప్రసంగంలో చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో సుమారు రూ.1.06 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. బడ్జెట్‌లో సుమారు రూ.80 వేల కోట్ల ఆర్థిక లోటు చూపించారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు సరైన కేటాయింపులు చేయలేదన్నారు. రాష్ట్రంలో సుమారు 87 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, వీరందరికీ 'తల్లికి వందనం' అమల్జేయాలంటే రూ.13 వేల కోట్లు కావాల్సి ఉందన్నారు. బడ్జెట్‌లో మాత్రం రూ.9,400 కోట్లు పెట్టిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20వేలు అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేంద్రంతో కలిపి అమలు చేస్తామని చెబుతున్నారని చెప్పారు. ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకు పింఛన్, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీల గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న 9 లక్షల డ్వాక్రా గ్రూపులకు కేవలం రూ.100 కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. విశాఖపట్నంలో 46 కిలోమీటర్లు, అమరావతిలో 38 కిలోమీటర్ల మెట్రోరైళ్లను మూడేళ్లల్లో పూర్తిచేస్తామని బడ్జెట్‌లో పొందుపరిచారని తెలిపారు. కానీ కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. తాము 2019లో అధికారంలోకి వచ్చిన సమయంలో గత టిడిపి ప్రభుత్వం కూడా రూ.50వేల కోట్ల అప్పులు చూపిందన్నారు. 2019-24 మధ్యలో తమ ప్రభుత్వం రూ.36వేల కోట్లే అప్పులు చేసిందన్నారు. ట్రూఅప్ పేరుతో రూ.15వేల కోట్ల భారం ప్రజలపై మోపారని చెప్పారు. బొత్స ప్రసంగిస్తున్న సమయంలో పలుసార్లు అచ్చెన్నాయుడు జోక్యం చేసుకున్నారు. మానిఫెస్టోను ఐదేళ్లల్లో ఎప్పుడైనా అమలు చేసుకోవచ్చునని అచ్చెన్నాయుడు చెప్పారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధి రంగాలను పట్టించుకోలేదని విమర్శించారు. మండలి ఛైర్మన్ మోషేను రాజు కూడా బడ్జెట్‌పై సమాధానం ఇచ్చే సమయంలో బొత్స లేవనెత్తిన అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అయినా పలుసార్లు అడ్డుతగలడంతో వాకౌట్ చేస్తునట్లు బొత్సతో పాటు వైసిపి సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు.

వైవి విక్రాంత్‌రెడ్డికి ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

కాకినాడ సీ పోర్టు వాటాల బదిలీ వ్యవహారంలో వైవీ విక్రాంత్ రెడ్డిపై సిఐడి నమోదు చేసిన కేసులో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25వేలతో రెండు పూచీకత్తులు, కేసుకు చెందిన వాళ్లను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రలోభపెట్టకూడదు, భయపెట్టకూడదని ఆదేశించింది. అలాగే దర్యాప్తునకు సహకరించాలని, పిలిచినప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలనే షరతు విధిస్తూ జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారు.

కాటికాపరుల సమస్యలపై 11న ధర్నా : కెవిపిఎస్

ప్రజాశక్తి-విజయవాడ

కాటికాపురుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 11న విజయవాడలో జరిగే ప్రదర్శన, మహాధర్నాను జయప్రదం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. విజయవాడలోని పూలే అంబేద్కర్ భవనంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజ్, సహాయ కార్యదర్శి గుండెమెడ క్రాంతి కుమార్‌తో కలిసి ఆయన మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. కాటికాపరులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. వయసు పైబడిన వారందరికి రూ.8 వేల పెన్షన్ ఇవ్వాలని, వృత్తి పరికరాలివ్వాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని, గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. శ్మశానాలు కబ్జాకు గురికాకుండా ఆక్రమణదారుల నుండి కాపాడాలని, శ్మశానానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, శ్మశానంలో బోరు వేయించి, షెడ్డు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోలీస్ కస్టడీకి పోసాని

- అనుమతించిన నరసరావుపేట కోర్టు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సినీ నటుడు, రచయిత, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోసాని కృష్ణమురళిని రెండురోజులపాటు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రెడ్డి ఆశీర్వాదంపాల్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. కృష్ణమురళిపై నమోదైన కేసులకు సంబంధించి ఆయన నుండి వివరాలు రాబట్టడానికి వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని నరసరావుపేట పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపారు. పోసానిని రెండు రోజుల పోలీసు కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కస్టడీ సమయంలో థర్డ్ డిగ్రీ ఉపయోగించకూడదని, కృష్ణమురళి కోరితే న్యాయవాదుల సమక్షంలోనే విచారించాలని, పోలీస్ కస్టడీకి తీసుకొచ్చి, తీసుకెళ్లే సమయంలో వైద్య పరీక్షలు చేయించి కోర్టుకు నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు నరసరావుపేట పోలీసులు శనివారం, ఆదివారం విచారించ నున్నారు. ఇదిలా ఉండగా కృష్ణమురళి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణను ఆయన తరుపు న్యాయవాదుల కోరిక మేరకు సోమవారానికి కోర్టు వాయిదా వేసింది.

అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసుపై ధర్నా

- ఉపసంహరించుకోవాలని 'ఉక్కు' అఖిలపక్ష కార్మిక సంఘాలు డిమాండ్

ధర్నా చేస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు కార్మికుల సమస్యలపై ఉద్యమిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్‌కు విశాఖ ఉక్కు యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసును తక్షణమే ఉపసంహరించుకోవాలంటూ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలనా భవనం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. 'షోకాజ్ నోటీసును తక్షణం ఉపసంహరించుకోవాలి, కార్మిక సమస్యలను పరిష్కరించాలి' అని పెద్దపెట్టున నినదించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రామారావు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం అవలంభిస్తోన్న కుట్రలను తెలియజేశారు. ఉక్కు పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులపై నిర్బంధాన్ని ప్రయోగించాలనుకోవడం దారుణమన్నారు. కర్మాగారంలో నేటి వరకు ఉన్న ప్రతి ప్రయోజనాన్ని పోరాటాల ద్వారానే సాధించుకున్నామని గుర్తు చేశారు. పోరాటంలో అనైక్యతను, భయాందోళనను సృష్టించేందుకు కుటిలయత్నాలు జరుగుతున్నాయని, వాటిని ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని స్పష్టం చేశారు. కార్మిక సమస్యల పట్ల యాజమాన్యం తన తీరును మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోకతప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీతో ఉక్కు పరిశ్రమలో సమస్యలు పరిష్కారం కావన్నారు. ప్లాంట్‌ను బాగా నడిపించేందుకు సమర్థవంతమైన యాజమాన్యం అవసరమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కెఎస్ఎన్.రావు, రమణమూర్తి, డివి.రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు, డి.సురేష్ బాబు, రామ్ కుమార్, విళ్లా రామ్మోహన్ కుమార్, పరంధామయ్య, డేవిడ్ మాట్లాడారు. యాజమాన్య నిరంకుశ చర్యలను ఖండించారు. కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, బి.అప్పారావు, పుల్లారావు, టివికె.రాజు, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కెవిపిఎస్ బృందం

యశ్వంత్ మృతిపై విచారణ జరపాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి
- కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలోని తంగెళ్లమూడికి చెందిన దళిత బాలుడు బంగారు యశ్వంత్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో యశ్వంత్‌ను మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి చిత్రహింసలకు గురిచేయడం వల్లే బాలుడు మరణించారని, ఇది ముమ్మాటికీ పోలీసులు చేసిన హత్యే అని తెలిపారు. కెవిపిఎస్ బృందం శుక్రవారం యశ్వంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చింది. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ... తల్లిదండ్రులను భయపెట్టి పోస్టుమార్టం చేయించారని, మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయని చెబుతున్నా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చిత్రహింసలకు గురిచేసి ముక్కు పచ్చలారని బాలుడిని హత్య చేశారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. హత్య కేసుతోపాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

హోం మంత్రికి పట్టదా..?

రాష్ట్రంలో దళితులపై దుర్మార్గమైన దాడులు, హత్యలు జరుగుతుంటే హోమ్ శాఖ మంత్రికి పట్టదా? అని మాల్యాద్రి నిలదీశారు. వాస్తవాలు పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చాలని కోరారు. ఈ దారుణమైన ఘటనపై దళిత, గిరిజన ప్రజా సంఘాలు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, నాయకులు మంచెల్ల ఇస్సాక్, పలువురు కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

వ్యవసాయం తరువాత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకుందని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. ఆ రాష్ట్ర కమిటీ సమావేశం కృష్ణా జిల్లా పెడన పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో శుక్రవారం జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి వేయడంతో చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం షెడ్ కార్మికులకు, సహకార సంఘాలతో నేత నేస్తున్న చేనేత కార్మికులకు అమలు జరపలేదని, బడ్జెట్‌లో చేనేతకు కేటాయింపులు కూడా చేయలేదని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమను రక్షిస్తామని, జిఎస్‌టి రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని, 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు జరుపుతామని హామీ ఇచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం చేనేతల వృద్ధికి రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని, చేనేతపై జిఎస్‌టి పూర్తిగా చేయాలని, 200 యూనిట్ల ఉచిత కరెంటుకు వెంటనే జిఒ విడుదల చేయాలని, సహకార సంఘాలకు చెల్లించాల్సిన యూరన్ సబ్సిడీ, పావలా వడ్డీ రిబేటు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, సమన్వయ కమిటీ కన్వీనర్ మున్నూరు భాస్కరయ్య, కష్ణాజిల్లా కార్యదర్శి గోరు రాజు, జిల్లా అధ్యక్షుడు వాసా గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

గోరకల్లుకు అన్యాయం చేసిన వైసిపి : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గపరిధిలోని గోరకల్లు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించలేక 2020 జులైలో అప్పటి వైసిపి ప్రభుత్వం అత్యవసర పనులను సైతం ప్రీక్లోజర్ చేసిందని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. శాసనసభలో శుక్రవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 2013-19 టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.110 కోట్లతో గోరకల్లు రిజర్వాయర్ పనులు 91 శాతం పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. గోరకల్లు రిజర్వాయర్ నిండితేనే కడప, పులివెందులకు కృష్ణా జలాలు వెళ్తాయన్నారు. గాలేరు, నగరి సుజల స్రవంతికి గండికోట, అవుకు, చిత్రావతి, పైడిపాలెం రిజర్వాయర్లకు నీరందించే ఈ రిజర్వాయర్ ప్రాధాన్యతను నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గుర్తించకపోవడం దుర్మార్గమన్నారు. రిజర్వాయర్‌లో చేపట్టాల్సిన అత్యవసర పనుల కోసంరూ.99 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. అత్యవసర పనులు చేపట్టి త్వరిత గతిన పూర్తి చేస్తామని మంత్రి సభకు తెలిపారు.

టిటిడి ఎడి బిల్డింగ్ వద్ద కాంగ్రెస్ ధర్నా

'రుయా'ను సూపర్ స్పెషాలిటీ చేయాలి

- ఎడి బిల్డింగ్ వద్ద కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి రుయా ఆస్పత్రిని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. టిటిడి ఎడి బిల్డింగ్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప, పేదల ఆరోగ్యం బాగుపడడం లేదన్నారు. కరోనా తరువాత గుండె, లివర్, కిడ్నీ జబ్బులు ఎక్కువయ్యాయన్నారు. పేదవారికి జబ్బు వస్తే పెద్ద ఆస్పత్రికి పోలేరని, గుంటూరులోనూ, వైజాగ్‌లోనూ సూపర్‌స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయన్నారు. తిరుపతిలోనూ రుయాను ఆ విధంగా తీర్చిదిద్దాలన్నారు. టిటిడిలో యాత్రికులకు వడ, పాయసం ఇవ్వడం కాదని, ఉచితంగా మంచి వైద్యం కావాలని కోరారు. ఈ విషయాన్ని టిటిడి చైర్మన్, ఇఒలు గుర్తించాలన్నారు. అలిపిరి దగ్గర నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ చిన్నపిల్లల ఆస్పత్రి భవనాలను ప్రభుత్వం టిటిడికి అప్పగిస్తే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

విశాఖ కైలాసగిరిపై అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

కైలాసగిరిపై ఎగిసిపడుతున్న మంటలు

విశాఖలోని కైలాసగిరిపై శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ అలుముకుంది. దీంతో కైలాసగిరిపై ఉన్న సందర్శకులు ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపుచేశారు. రోప్ వే సమీపంలో అక్కడి సిబ్బంది, వ్యాపారులు వ్యర్థాలను తగులబెట్టడంతో మంటలు అంటుకున్నట్లు పలువురు తెలిపారు. విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ ఆదేశాల మేరకు అగ్నిమాపక, అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎవరికి ఎటువంటి ప్రమాదమూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

1/70పై సిఎం స్పందించాల్సిందే..

- ఆదివాసీ ఆత్మగౌరవ దీక్షలో నాయకులు

ప్రజాశక్తి - పాడేరు టౌన్ (అల్లూరి జిల్లా)

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అప్పలనర్స, చిత్రంలో సురేంద్ర తదితరులు

1/70 చట్టాన్ని సవరించాలని శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని, ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ గేటు వద్ద వేదిక ఆధ్వర్యంలో రెండు రోజులపాటు తలపెట్టిన ఆదివాసీ ఆత్మగౌరవ నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, ఆదివాసీ, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టం ఉల్లంఘనలపై ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల ప్రయోజనాల పట్ల గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో షెడ్యూల్ ఏరియాలో తీవ్ర అన్యాయం జరిగింద న్నారు. గిరిజనేతరులతో ఉద్యోగ నియామకాలు చేపడుతుండడంతో స్థానిక ఆదివాసీ నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమై నేటికి సుమారు పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో రెండు రోజులు ఆదివాసీ ఆత్మగౌరవ దీక్షకు గిరిజనులు దిగార న్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ హక్కులను ఉల్లంఘిస్తున్న పాలకవర్గాలను ఆదివాసీ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా ప్రశ్నించాలని కోరారు. టిఎసి ఆమోదం లేకుండా కేటాయించిన హైడ్రో పవర్ ప్రాజెక్టులను తక్షణమే రద్దుచేయాలని, 1/70 చట్టం అమలుపైనా, అయ్యన్న వ్యాఖ్యలుపైనా అసెంబ్లీ సాక్షిగా సిఎం చంద్రబాబు స్పందించాలని డిమాండ్ చేశారు. జిఒ 3ని పునరుద్ధరించాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే చెందేలా వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ చట్టం చేయాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని, ఆదివాసీ ప్రాంతంలో బినామీ వ్యవస్థ, గిరిజనేతరుల వలస నిరోధక చట్టం చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్‌కు రూ.17 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక నాయకులు కూడా రాధాకృష్ణ, కూడా సుబ్రహ్మణ్యం, ఎస్.మాణిక్యం, కె.పార్వతమ్మ, చిన్ని, విమల, ప్రభ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి అత్యంత బలమైన బ్రాండ్

- బీమా రంగంలో ప్రపంచంలోనే 3వ స్థానం
- విలువలో ఎస్‌బిఐ లైఫ్‌కు 76వ ర్యాంక్
- బ్రాండ్ ఫైనాన్స్ రిపోర్ట్

ముంబయి : ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ప్రపంచంలోనే బీమా రంగంలో మూడో అత్యంత బలమైన కంపెనీగా గుర్తింపును పొందింది. బ్రాండ్ స్ట్రెంత్ ఇండెక్స్ (బిఎస్ఐ)లో 100కు గాను 88 స్కోర్ పొందినట్లు బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100 రిపోర్ట్-2025లో వెల్లడించింది. పోలాండ్‌కు చెందిన పిజడ్‌యు సెక్యూర్డ్ 94.4 బిఎస్ఐ స్కోర్‌తో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత చైనా లైఫ్ ఇన్సూరెన్స్ 93.5 బిఎస్ఐ స్కోర్‌తో రెండో స్థానంలో ఉంది. మూడో స్థానంలో భారత బీమా దిగ్గజం ఎల్ఐసి నిలువడం విశేషం. బ్రాండ్ ఫైనాన్స్ రిపోర్ట్ ప్రకారం.. బ్రాండ్ విలువ ప్రకారం మాత్రం ఎల్ఐసి 12వ స్థానంలో అత్యంత విలువైన బీమా బ్రాండ్‌గా నిలిచింది. ఇందులో ఎస్‌బిఐ లైఫ్ 76వ ర్యాంక్‌ను పొందింది. గ్లోబల్ టాప్ 100లో ఈ రెండు భారత కంపెనీలు మాత్రమే చోటు దక్కించుకున్నాయి. అధిక రాబడి, మెరుగైన ఫలితాలు, పెరుగుతున్న వడ్డీ రేట్లు, లాభదాయకత పరంగా 2025లో టాప్ 100 బీమా కంపెనీల బ్రాండ్ విలువలో 9 శాతం పెరిగింది. అన్ని రకాల బీమా ఉత్పత్తులకు డిమాండ్ పెరగడంతో అగ్రశ్రేణీ బీమా బ్రాండ్‌ల మార్కెట్ క్యాపిటలైజేషన్ పెరిగింది. ఆర్థిక పునరుద్ధరణ, సానుకూల మార్కెట్ సెంటిమెంట్ ఈ రంగంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలపరిచాయి. వ్యూహాత్మక విలీనాలు, కొనుగోళ్లు, సాంకేతిక పురోగమనాలు పరిశ్రమ వృద్ధిని వేగవంతం చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.9,444.42 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో ముఖ్యంగా ఉద్యోగుల వ్యయాలు తగ్గడంతో ప్రధానంగా నిర్వహణ వ్యయాలు తగ్గి సంస్థ మెరుగైన లాభాలకు దోహదం చేశాయి.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళా సాధికారికతతోనే సమాజం అభ్యున్నతి సాధించి ప్రగతి పథంలో పయనిస్తుందని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు డిజిపి సతీమణి సీమా గుప్తా శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాశస్త్యాన్ని తమ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఐజిపి రాజకుమారి, డిఐజి కమ్యూనికేషన్స్ ఎన్ఎస్‌జె లక్ష్మీ, డిసిపి సరిత, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు జిల్లాకే పరిమితం చేయడం తగదు

- పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉచిత బస్సు పథకాన్ని జిల్లా పరిధిలోకే పరిమితం చేస్తామని చెప్పడం మహిళలను మోసం చేయడమేనని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి 9 నెలలు అవుతున్నా ఉచిత ప్రయాణం కల్పించకుండా కమిటీలతో కాలయాపన చేస్తోందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. రాష్ట్రాల పర్యటన పేరుతో మంత్రులు విహారయాత్రలు చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలకు రాష్ట్రం అంతటా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారని తెలిపారు. మహిళల కోసం నెలకు రూ.350 కోట్లు ఆర్టీసికి ఇవ్వడానికి ప్రభుత్వానికి మనస్కరించడం లేదన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం రాష్ట్ర వ్యాప్తంగా ఉండాలని డిమాండ్ చేశారు.

చేనేత సొసైటీల అవకతవకలపై విచారణ

- మంత్రి సవిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనంతపురంలోని పలు చేనేత సహకార సంఘాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై ప్రభుత్వం విచారణ చేపట్టిందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖమంత్రి సవిత పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో శుక్రవారం చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వేమిరెడి ప్రశాంతిరెడ్డి, కందికుంట వెంకట ప్రసాద్, డాక్టర్ బి.జయనాగేశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. నేషనల్ రూరల్ లైవ్లీమిషన్‌లో భాగంగా సెర్ప్ ఆధ్వర్యంలో రూ.120కోట్లతో నేతన్నలకు ఉపాధి కల్పించే పథకాన్ని శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఆమె తెలిపారు. త్వరలోనే చేనేత సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

లెక్సస్ కొత్త ఎల్ఎక్స్ 500డి బుకింగ్స్ షురూ..

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ లెక్సస్ ఇండియా తన కొత్త ఎల్ఎక్స్ 500డిల కోసం బుకింగ్స్‌ను తెరిచినట్లు ప్రకటించింది. 3.3 లీటర్ వి6 ట్విన్ టర్బో డీజిల్ ఇంజిన్ కలిగిన ఈ కారు అర్బన్ వేరియంట్ ఎక్స్‌షోరూం ధరను రూ.3 కోట్లుగా నిర్ణయించింది. మరో వేరియంట్ ఓవర్‌ట్రైల్ ధరను రూ.3.12 కోట్లుగా ప్రకటించింది. దీనికి గరిష్టంగా ఎనిమిదేళ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల వరకు వారంటీ అందిస్తున్నట్లు పేర్కొంది.

వారాంతం మార్కెట్లలో ఊగిసలాట

ముంబయి : వరుసగా రెండు రోజులు లాభాల్లో సాగిన మార్కెట్లకు మళ్లీ వాణిజ్య యుద్ధ భయాలు పట్టుకున్నాయి. వారాంతం సెషన్‌లో తీవ్ర ఊగిసలాట మధ్య తుదకు నష్టాలు చవి చూశాయి. శుక్రవారం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 7.51 పాయింట్లు తగ్గి 74,333కు పడిపోయింది. ఇంట్రాడేలో 246 పాయింట్లు లాభపడిన సూచీ.. మధ్యాహ్నం సమయంలో అమ్మకాలను ఎదుర్కొంది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 7.80 పాయింట్లు పెరిగి 22,552 వద్ద ముగిసింది. ఈ సూచీ ఇంట్రాడేలో 89 పాయింట్లు రాణించింది. సెన్సెక్స్-30లో జొమాటో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టిపిసి, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టైటాన్, పవర్ గ్రిడ్, హెచ్‌యుఎల్, టెక్ మహీంద్రా సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్ తదితర స్టాక్స్ అధిక నష్టాలను చవి చూశాయి. గురువారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 2,377.32 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు.

టొయోటా నుంచి హైలక్స్ బ్లాక్ ఎడిషన్

బెంగళూరు : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) కొత్తగా హైలక్స్ బ్లాక్ ఎడిషన్‌ను శుక్రవారం భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.37.90 లక్షలుగా నిర్ణయించింది. ప్రపంచ స్థాయి ఇంజనీరింగ్, అధునాతన భద్రత, ప్రీమియం సౌకర్యాలతో దీన్ని డిజైన్ చేసినట్లు ఆ కంపెనీ తెలిపింది. 2.8 లీటర్ ఫోర్ సిలీండర్ టర్బో డీజిల్ ఇంజిన్‌ను ఇందులో ఉపయోగించింది. ఆధునాతన భద్రత కోసం ఇందులో ఏడు ఎస్ఆర్ఎస్ ఎయిర్‌బ్యాగ్‌లను అమర్చింది.

వంద రైల్వే స్టేషన్లలో స్విగ్గీ డెలివరీ సేవలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ తాజాగా ఐఆర్‌సిటిసితో కలిసి మరిన్ని స్టేషన్లకు తన సేవలను విస్తరించింది. 20 రాష్ట్రాల పరిధిలోని 100 స్టేషన్లల్లో ఫుడ్ డెలివరీ సేవలను అందించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. రానున్న రోజుల్లో మరిన్ని చోట్ల ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ తెలిపారు. రైల్వే ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందించేందుకు ఐఆర్‌సిటిసి 2024 మార్చిలో తొలిసారి స్విగ్గీ ఒప్పందం కుదుర్చుకుంది. మరో ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో కూడా రైల్వే స్టేషన్లలో ఇదే తరహా సేవలను అందిస్తోంది.

30వేల మందికి విదేశాల్లో ఆస్తులు

- విలువ రూ.29వేల కోట్లు

న్యూఢిల్లీ : దేశంలోని 30,000 పైగా పన్ను చెల్లింపుదారులు తమకు విదేశాల్లో ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్స్ (సిబిడిటి) వెల్లడించింది. వారు మొత్తంగా రూ.29,000 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారని పేర్కొంది. పన్ను చెల్లింపుదారులను క్లీన్‌గా మార్చడానికి సిబిడిటి ప్రచారాన్ని ప్రారంభించిన తర్వాత 30,000 మంది పన్ను చెల్లింపుదారులు రూ.29వేల కోట్లకు పైగా విదేశీ ఆస్తులను ప్రకటించారు. అదే విధంగా కొత్తగా 6,734 మంది నివాసితులు తాము ప్రవాసేతరులుగా ప్రకటించుకున్నారు. దీంతో అదనంగా రూ.1,090 కోట్ల విదేశీ ఆదాయం లెక్కల్లోకి వచ్చిందని వెల్లడించింది. పన్ను చెల్లింపుదారులు విదేశాల్లో సగటున రూ.1 కోటి విలువ చేసే ఆస్తిని కలిగి ఉన్నారు. 2018 నుండి విదేశీ బ్యాంకు ఖాతాల వివరాలు, వాటిలోని బ్యాలెన్స్, డివిడెండ్‌లు, స్వీకరించిన వడ్డీ, స్థూల చెల్లింపులతో కూడిన సమాచారాన్ని సిబిడిటి సమీకరిస్తోంది. విదేశాల్లో భారీగా ఆస్తులు కలిగిన 19,500 మందికి ఐటి శాఖ ఇమెయిల్ ద్వారా నోటీసులను పంపించింది. వారి ఆస్తులను వివరాలను వెల్లడించాలని కోరిన విషయాన్ని తెలిపింది.

10 రోజులు ఆఫీసుకు రావాల్సిందే

- ఉద్యోగులకు ఇన్ఫీ ఆదేశాలు

బెంగళూరు : నెలలో 10 రోజులు తప్పకుండా ఆఫీసుకు రావాల్సిందేనని దేశంలోనే రెండో అతిపెద్ద టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసింది. కరోనా తర్వాత ఐటి సంస్థలు ఇంటి వద్ద నుంచి పని సౌలభ్యాన్ని కల్పించాయి. ఇప్పటికీ అనేక సంస్థలు హైబ్రిడ్ పద్ధతిని అవలంభిస్తున్నాయి. వారానికి కనీసం రెండు, మూడు రోజులైనా కార్యాలయాలకు వచ్చి పని చేయాల్సిందేనని స్పష్టం చేస్తున్నాయి. దిగ్గజ సంస్థలు టిసిఎస్, విప్రో సంస్థలు దాదాపు ఆఫీసుకు రావడాన్ని తప్పనిసరి చేశాయి. ఇన్ఫోసిస్ కూడా గతంలో తమ ఉద్యోగులకు ఇలాంటి సూచనే చేసినప్పటికీ పూర్తిగా ఫలించలేదు. దీంతో ఓ దశలో ఉద్యోగులు వారంలో కనీసం మూడు రోజులు ఆఫీసుకు రావాలని ఆదేశించింది. తాజాగా మార్చి 10 నుంచి నెలకు 10 రోజుల తప్పనసరి చేసిందని తెలుస్తోంది.

క్యాస్ట్రోల్‌కు షారుఖ్ ఖాన్ కొత్త ప్రచారం

న్యూఢిల్లీ : ప్రముఖ లూబ్రికెంట్ కాస్ట్రోల్ ఇండియాకు బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ ప్రచారం చేయనున్నారు. ఇంజిన్ వేడెక్కకుండా అత్యుత్తమ మూడు రెట్ల రక్షణను అందించడానికి రూపొందించిన నూతన క్యాంపెయిన్‌లో ఆయన పాల్గొంటారని ఆ కంపెనీ తెలిపింది.

సంపాదకీయం

వ్యంగ్యానికి సంకెళ్లు

'వికటన్' వెబ్‌సైట్‌ను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అన్‌బ్లాక్ చేయాలని మద్రాస్ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వు వ్యంగ్యానికి కేంద్ర ప్రభుత్వం వేసిన సంకెళ్లను సడలించడమే! ఇది స్వాగతించదగినది. అయితే, వివాదానికి మూలమైన కార్టూన్‌ను తాత్కాలికంగా తొలగించాలని చెప్పడం ద్వారా కేంద్ర నిరంకుశాధికారాల్ని న్యాయస్థానం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చకపోవడం ప్రజాస్వామ్య ప్రియులకు, భావ ప్రకటనా స్వేచ్ఛను బలపరిచే వారికీ బాధ కలిగిస్తుంది. అమెరికాలో నివసించడానికి తగు చట్టబద్ధ పత్రాలు లేవన్న కారణంతో వేలాదిమంది భారతీయ సంతతి పౌరులను అక్రమ వలసదారులని ముద్ర వేసి, వారిని ఆ దేశం నుండి వెళ్లగొడుతున్న సంగతి లోకానికి ఎరుకే. అయితే, వారిని కరుడుగట్టిన నేరస్తులు లేదా ఉగ్రవాదుల మాదిరి కాళ్లను గొలుసులతో బంధించి, చేతులకు సంకెళ్లు వేసి మాతృదేశానికి పంపడంతో యావత్ భారతీయులు తల్లడిల్లిపోయారు. అయినా పాలక బిజెపి కి, ప్రధాని మోడీకి ఇది పట్టలేదు. పైపెచ్చు తగిన పత్రాలు లేకుండా మరో దేశంలో నివసించడం నేరమేనంటూ భారతీయ మూలాలున్న పౌరులను కించపరుస్తున్నారు. ఇటీవల కేంద్ర మంత్రి ఖట్టర్ దారుణమైన వ్యాఖ్యలు మరింత బాధాకరం. అక్రమ వలసదారుల పేరిట మన పౌరులను గొలుసులు, బేడీలతో అమృతసర్ విమానాశ్రయానికి తరలించిన సమయంలోనే ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల భేటీ జరిగింది కానీ భారత సంతతి పౌరులకు జరిగిన అవమానాన్ని గురించి ప్రశ్నించడం కాదు సరికదా కనీస ప్రస్తావన కూడా చేయలేదు. ఇటువంటి దుర్మార్గాన్ని ఎండగడుతూ 'వికటన్' వెబ్‌సైట్ ఒక కార్టూన్‌ను ప్రచురించింది. ఇరు దేశాధినేతల భేటీలో ప్రధాని నరేంద్ర మోడీ సంకెళ్లతో పాల్గొన్నట్లు దాంట్లో చిత్రించడం వాస్తవ పరిస్థితిని కళ్లకు కట్టింది. ఒక్క కార్టూన్‌లో ట్రంప్ దుర్మార్గాన్ని, నరేంద్ర మోడీ అచేతనత్వాన్ని, భారతీయుల ఆవేదననూ వ్యక్తం చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. భారతీయ ఆత్మను, భారతీయుల ఆవేదననూ ప్రతిబింబించిన ఆ కార్టూన్‌పై ఆగ్రహించిన బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం, సమాచార ప్రసార శాఖ 'వికటన్' వెబ్‌సైట్ మొత్తాన్ని బ్లాక్ చేయడమూ ఆగమేఘాలపై జరిగిపోయాయి. ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్లి అరదండాలతో వెనుదిరిగిన వేలాదిమంది భారత యువతీయువకుల గురించి ఏమాత్రం చింతించని కమలం పార్టీ నేతలు ఈ కార్టూన్‌కు అంతలా కలత చెంది, ఆ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయించడం వారి నిరంకుశ పోకడలకు నిలువెత్తు నిదర్శనం. 1975-77 మధ్య దేశంలో సాగిన మీడియా సెన్సార్ కు దీనికి ఏమీ తేడా లేదు కదా! అందుకే నరేంద్ర మోడీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలులో ఉందన్న కొందరి వ్యాఖ్యలు ఎంతమాత్రం సత్యదూరం కాదు. జాతీయోద్యమ కాలం నుండి వందేళ్ల చరిత్రగల 'వికటన్' వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన కేంద్ర మంత్రిత్వశాఖ కనీసం ఆ సమాచారాన్ని పదిహేను రోజులకు కూడా తెలియజేయక పోవడంతో మద్రాస్ హైకోర్టు గడప తొక్కవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో జరిగిన విచారణలో ధర్మాసనం 'వికటన్' వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాలని ఉత్తర్వులీయడం సానుకూలమైనదే! అయితే, ఆ కార్టూన్‌ను తాత్కాలికంగా తొలగిస్తేనే అన్‌బ్లాక్ చేయాలనడాన్ని ఎవరూ సమర్థించలేని పరిస్థితి. ఏది ఏమైనా మోడీ సర్కారు నిరంకుశ పోకడలపై ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభంగా పేరున్న మీడియా ఇలా ప్రచురించడం, నిర్బంధం విధిస్తే దాన్ని ప్రశ్నించడం అభినందనీయం. న్యాయస్థానం పరిమితంగానైనా ఊరటనివ్వడం మంచిదే! అయితే విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న 'వికటన్' వెబ్‌సైట్‌కు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాతో సహా తమిళనాట అనేక మీడియా సంస్థలు సంఘీభావం తెలపడం శుభసూచికం. నిరంకుశ పోకడలను ఆదిలోనే ప్రశ్నించాలి, ఎదుర్కోవాలి, తిప్పికొట్టాలి. లేకపోతే అది తొండ ముదిరి ఊసరవెల్లి అయిన చందంగా ఒకనాటి హిట్లర్, ముస్సోలినీల పాలనను తిరిగి తేవాలనుకుంటున్న శక్తుల ప్రమాదం పెరుగుతుంది. ప్రజాస్వామ్య ప్రియులు, భారత రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛ పరిఢవిల్లాలని కోరుకునే వారందరూ అప్రమత్తంగా ఉండాలి. ముప్పును నివారించుకోవాలి!

మహనీయుల మాట

ప్రతి మహిళా తను భర్తకు సేవలందించే బానిసను కాదని..సహచరినని..నిరంతరం గుర్తుంచుకోవాలి. మేధస్సును, తెలివితేటలను మెరుగు పరచుకుంటూ..ఆత్మ విశ్వాసంతో ప్రవర్తించాలి. ఇతరులకు తనను అగౌరవపరిచే, కించపరిచే అవకాశం ఇవ్వకూడదు.

- సుబ్రమణ్య భారతి,
సంఘ సంస్కర్త.

పిల్లల్ని కనడం మహిళల హక్కు

సందర్భం

వి. శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్ అగ్ర భాగాన నిలవాలంటే జనాభా పెరగాలని, అందుకు ఎక్కువ మంది పిల్లల్ని కనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మధ్య పదేపదే చెప్తున్నారు. పిల్లల్ని కనడం, కనకపోవడం, ఎంతమందిని కనాలి వగైరా అంశాలపై నిర్ణయాత్మక పాత్ర మహిళలది. పిల్లల్ని కనడం మహిళల హక్కు. దాన్ని అధికారంతో, పెత్తందారీతనంతో, శాసనాలతో ఆదేశించే హక్కు ఎవరికీ లేదు. ప్రభుత్వానికి అసలే లేదు. మహిళల భాగస్వామ్యం లేకుండా జనాభా విధానం రూపొందించడం అప్రజాస్వామికం.

జనాభా విధానం స్వాతంత్ర్యానంతరం పలు సందర్భాలలో వివాదంగా మారుతూ వస్తోంది. 1970వ దశకంలో వచ్చిన ఆహార సంక్షోభాన్ని, 1980వ దశకంలో వచ్చిన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి నాటి ప్రభుత్వం జనాభా నియంత్రణ పాలసీని తీసుకొచ్చింది. ఇద్దరు లేదా ముగ్గురు అంటూ కుటుంబ నియంత్రణకు పిలుపునిచ్చింది. జనాభా పెరగడం వల్ల ఆహార కొరత వస్తున్నదని, పేదరికం పెరుగుతున్నదని, జనాభాను నియంత్రించడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చని కుటుంబ నియంత్రణ నినాదం తీసుకొచ్చారు. 1975-76 ఎమర్జెన్సీ సమయంలో నాటి యువ నాయకుడు సంజయ్ గాంధీ బలవంతపు కుటుంబ నియంత్రణ అమలు చేశాడు. అది తీవ్రమైన వ్యతిరేకత సృష్టించింది. ఎమర్జెన్సీ నియంతృత్వ పాలనలో ఇదొక చీకటి అధ్యాయం. ఆ తర్వాత 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, ఇందిరా గాంధీ ఘోరంగా ఓడిపోయారు.

అభివృద్ధికి జనాభాకు సంబంధం లేదని నాడు సిపిఐ(యం), ఇతర అనేకమంది అభ్యుదయ మేధావులు ప్రకటించారు. అలాంటి వారిని అభివృద్ధి నిరోధకులుగా ముద్ర వేశారు. చైనా ఒకరు లేదా ఇద్దరు అంటే కమ్యూనిస్టులు మాట్లాడడం లేదని, మనల్ని వెనక్కి నెట్టడానికే కమ్యూనిస్టులు కుటుంబ నియంత్రణను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. ఈ 50 సంవత్సరాల అనుభవంలో జనాభా అదుపులోకి వచ్చినా పేదరికం అదుపు కాలేదని, ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగి మరికొన్ని ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నది చారిత్రక సత్యం. ఇప్పుడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మరో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నది.

ఇప్పుడు ప్రపంచంలో అగ్ర భాగాన నిలబడాలంటే భారత దేశానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న సానుకూల అంశం నైపుణ్యమని, దానికి మన వనరులు కావాలని, అందుకు జనాభా పెరగాలని చెప్తున్నారు. ఇప్పుడు చంద్రబాబుకు తోడు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా గొంతు కలుపుతున్నాడు. జనాభా తగ్గినందున లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గిపోయిందన్నది ఆయన ఆవేదనకు కారణం. కారణం ఏదైనా పెరిగే జనాభాకు సౌకర్యాలు, విద్య, వైద్యం, ఉద్యోగం కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోకుండా పిల్లల్ని కనమని ఆదేశించే హక్కు దానికి లేదు. పైగా స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేవారికి ఇద్దరు పిల్లలకు మించి ఉండరాదన్న షరతు ఎత్తివేస్తున్నారు. రిపబ్లిక్ టివి షోలో చంద్రబాబు మాట్లాడుతూ ఇద్దరు పిల్లలున్న వారిని పోటీకి అనర్హులుగా ప్రకటిస్తామంటూ జోక్ వేశారు. సభ వరకు ఇది జోక్ కావచ్చు. కానీ రేపు అది నిజం కాదన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే దేశంలో ముస్లిం జనాభా పెరుగుతూ హిందూ సంఖ్య తగ్గుతున్నదని, హిందువులు గంపెడు పిల్లల్ని కనాలని ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులు క్యాంపెయిన్ చేస్తున్నారు. ఇప్పుడు చంద్రబాబు వారికి తోడయ్యారు. బిజెపి పాలనలో పెరుగుతున్న నయా ఫాసిస్టు లక్షణాలలో ఇదొకటి. కాబట్టి చంద్రబాబు జోక్ రేపు నిజం కాదన్న హామీ ఏమీ లేదు. ఇదొక ప్రమాదకరమైన పరిణామానికి దారితీయొచ్చు.

> జనాభా పెరిగితేనే జీతాలు తగ్గుతాయి. ఆందోళనలు చేసే శక్తిని లేబర్ కోల్పోతుంది. మన సిఈవోలు కోరుకుంటున్న విధంగా వారానికి 80-90 గంటలు కిమ్మనకుండా చేస్తారు. ఉద్యోగ భద్రత అడగరు. సౌకర్యాలకు డిమాండ్ చేయరు. శ్రామికులను అణచివేసి వారి రక్తమాంసాలు పిండి ఈ సంక్షోభం నుండి బయట పడాలని బడా కార్పొరేట్ శక్తులు భావిస్తున్నాయి. అందుకు జనాభా పెంపుదలను ఒక సాధనంగా చేపట్టారు. దానికి నైపుణ్యమనే అందమైన ముసుగు వేసి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే చంద్రబాబు పిలుపు మహిళలకు, శ్రామికులకు వ్యతిరేకమైనది. ఇది ఆర్థిక అసమానతల్ని, మహిళల అణచివేతను మరింతగా పెంచుతుంది. అందుకే మహిళలు గళం విప్పాలి. తమ హక్కుల రక్షణకు పిడికిలి బిగించి ముందుకు రావాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అందుకు సాధనం కావాలి.

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం

భారత్ వెనుకబడిన దేశం. భూస్వామ్య ఆధిపత్య ధోరణులు, పురుషాధిపత్యం ఏదో ఒక రూపంలో కొనసాగుతున్నాయి. గతంలో వారసుడు కావాలని మహిళల అంగీకారంతో నిమిత్తం లేకుండా మగ పిల్లవాడు పుట్టినదాకా ఆడపిల్లల్ని కంటూనే ఉండేవారు. అయితే ఒకరకంగా మహిళల జనాభా పెరిగి పెళ్లిళ్ళు చేయడానికి వరకట్నాలు అదుపు లేకుండా పెరిగిపోయాయి. వారికి పెళ్లి చేయడమంటే 'మైనస్' అంటూ పురిట్లోనే చంపేసే పద్ధతులు నేర్చుకున్నారు. ఆధునిక శాస్త్ర పరిజ్ఞానంతో స్కాన్ చేయించుకొని ఆడపిల్ల అయితే అబార్షన్ చేయించి పొట్టలోనే చంపేస్తున్నారు. దీనికీ మహిళల ఆమోదం అక్కర్లేదు. మహిళల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ మగ పిల్లవాడని తెలిసేదాకా అబార్షన్లు జరుగుతూనే ఉంటాయి. మగ పిల్లవాడు మంచి శుభ ముహూర్తాన పుడితే అదృష్టం కలిసి వచ్చి ఆస్తి, సంపద పెరుగుతుందన్న మూఢ విశ్వాసంతో సహజ కాన్పులు కాకుండా సిజేరియన్ ద్వారా ముహూర్తం ప్రకారం బిడ్డను బయటకు తీసుకొస్తున్నారు. ప్రగతిశీల భావాలు కలిగిన డాక్టర్లు సైతం ఈ ఒత్తిళ్ళకు తలొగ్గుతున్నారు. అందుకే అవసరం లేకపోయినా సిజేరియన్ ఆపరేషన్లు పెరిగాయి. బిడ్డలు వద్దనుకుంటే ఇప్పటికీ పురుషులు వేసక్టమీ చేయించుకోడానికి బదులు మహిళలనే ఎక్కువ రిస్క్‌తో కూడిన ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకునేట్లు ఒత్తిడి చేస్తున్నారు. ఏది జరిగినా మహిళల ఆరోగ్యానికే చేటు.

క్రమంగా జనాభాలో మహిళల నిష్పత్తి తగ్గిపోతున్నది. రాష్ట్రంలో ప్రతి 1000 మంది పురుషులకు 936 మంది మాత్రమే మహిళలున్నారు. యువకులకు పెళ్లిళ్ళు కాక దూరాన ఉండే వెనుకబడిన ప్రాంతాల నుండి (ఉదాహరణకు ఉత్తరాంధ్ర) పేద తల్లిదండ్రులకు డబ్బులిచ్చి ఆడపిల్లల్ని తెచ్చుకొని తమ స్వంత ప్రాంతంలో పెళ్లి చేసుకుంటున్నారు. వారిదే కులమో పట్టించుకోవడం లేదు. బంధు మిత్రులకు తమ స్వంత కులం పేరే చెప్పి తప్పించుకుంటున్నారు. అవసరానికైనా కుల పట్టింపులు లేకపోవడం మంచిదే. మరోవైపు సంపన్నులు తమకు పిల్లలు లేకపోతే పేదింటి మహిళల గర్భాన్ని అద్దెకు తీసుకుంటున్నారు. దీన్నే 'సరోగసీ' అంటున్నారు. దానికోసం చట్టాలు కూడా చేస్తున్నారు. మహిళల స్వేచ్ఛ, హక్కులు ప్రాణాలతో సైతం ఇది చెలగాటమాడడమే. సంపన్న వర్గాల పెత్తనంలో నలుగుతున్న ఈ భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజంలో మహిళలు మార్కెట్‌లో సరుకుగా మారిపోయారంటే అతిశయోక్తి కాదు.

ప్రభుత్వ పర్సనల్ 'లా'లు, ఫ్యామిలీ పాలసీలు మహిళలకు ప్రతికూలంగా ఉంటున్నాయి. యూనిఫామ్ సివిల్ కోడ్ పేరుతో ఇప్పుడు సనాతన హిందూ మత ఆచారాలను అన్ని మతాల ప్రజలపై రుద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడింది. ఈక్వల్ సివిల్ కోడ్ స్థానంలో యూనిఫామ్ సివిల్ కోడ్ పేరుతో మహిళల హక్కుల్ని మరింతగా హరిస్తుంది. అంబేద్కర్ ఇలాంటి ఫ్యామిలీ కోడ్‌ను ఎన్నడూ కోరుకోలేదు. అన్ని మతాల ప్రజలకు సమాన హక్కులు, ప్రత్యేకించి హిందూ మతంలో స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా అంబేద్కర్ ఉమ్మడి సివిల్ కోడ్ ఉండాలని కోరుకున్నారు. ఇది ఈక్వాలిటీ సివిల్ కోడే.

మహిళల హక్కుల్ని హరించే ఎలాంటి విధానాన్నైనా కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తారు. జనాభా పెరుగుదల, తగ్గుదల ప్రజలు ఐచ్ఛికంగా పాటించాలి. అందునా మహిళలది నిర్ణయాత్మక పాత్ర కావాలి. ప్రస్తుత సమాజంలో దాన్ని ఆశించలేము. మహిళలకు సమాన హక్కులు కల్పించే నూతన సమాజం సోషలిజంలోనే అది సాధ్యం.

మన ఆర్థిక వ్యవస్థ సర్వీసు రంగంపై ఆధారపడి నడుస్తున్నది. ఇందులో ఉత్పత్తి జరగదు. జరిగిన ఉత్పత్తిని పంచుతోంది. ఆ పంపకం సంపన్నులకు అనుకూలంగా జరుగుతున్నది. అందుకే సంక్షోభాలు వస్తున్నాయి. రానున్న కాలంలో చౌక శ్రమతోనే ఈ పోటీలో నిలబడగలమని చంద్రబాబు, మోడీ భావిస్తున్నారు. అందుకు లేబర్ మార్కెట్‌లో చౌక శ్రమ దొరకాలి. జనాభా పెరిగితేనే జీతాలు తగ్గుతాయి. ఆందోళనలు చేసే శక్తిని లేబర్ కోల్పోతుంది. మన సిఈవోలు కోరుకుంటున్న విధంగా వారానికి 80-90 గంటలు కిమ్మనకుండా చేస్తారు. ఉద్యోగ భద్రత అడగరు. సౌకర్యాలకు డిమాండ్ చేయరు. శ్రామికులను అణచివేసి వారి రక్తమాంసాలు పిండి ఈ సంక్షోభం నుండి బయట పడాలని బడా కార్పొరేట్ శక్తులు భావిస్తున్నాయి. అందుకు జనాభా పెంపుదలను ఒక సాధనంగా చేపట్టారు. దానికి నైపుణ్యమనే అందమైన ముసుగు వేసి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే చంద్రబాబు పిలుపు మహిళలకు, శ్రామికులకు వ్యతిరేకమైనది. ఇది ఆర్థిక అసమానతల్ని, మహిళల అణచివేతను మరింతగా పెంచుతుంది. అందుకే మహిళలు గళం విప్పాలి. తమ హక్కుల రక్షణకు పిడికిలి బిగించి ముందుకు రావాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అందుకు సాధనం కావాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శి /

కవిత్వం

అయిననూ....!?

సౌందర్య దరహాస చంద్రికలు సరే
కనబడని ముళ్ళ కిరీటాలెన్నో..!?
ఉప్పొంగే ప్రేమల వెనుక
దహిస్తున్న కార్చిచ్చు !?
ప్రవహిస్తున్న కన్నీటి లావా!?
లోలోన విస్ఫోటాలకు సిద్ధంగున్న
రక్తపర్వతాలు!?
మధురమైన పాట వెనుక
విషాద గాథలెన్నో..?!
సౌందర్య దీపాల వెనుక
కమిలిన గాయాలెన్నో..?!
ఏదీ లోతందదు.
వ్యవస్థీకృత విధ్వంసమేదో..
విస్ఫోటనమేదో..
సునామీ ఏదో..
ఆమె లానే..లోనే..!?
కల్పనల వాస్తవంగానే..
ఆత్మహత్యల హత్యగానే..
ఎప్పటిలానే..
ఆమె అన్నీనూ..
ఏమీ కాదూనూ...
ఆమె లేనిదే
ఏదీ లేదు.
అయిననూ...
ఎన్నైనా చెప్పండి
పేరుకే.. ఉత్తుత్తికే..
పొగడ్తకే.. దేవతగానే !?
ఆమె
ఇప్పుడిక్కడ
బానిసలకు బానిసగానే ..!?
కల్పనల వాస్తవంగానే..!?
అవమానాల అణచివేతగానే..!?
మానభంగాల ముద్ధగానే..!?
ఆత్మహత్యల హత్యగానే..!?

- శిఖా-ఆకాష్,
సెల్ : 9381522247.

అన్నీ మీరే !

స్త్రీ బుద్ధి ప్రళయాంతకం అన్న శాస్త్రకారులూ మీరే
ఆడపిల్లకు అక్షర మెందుకన్నదీ మీరే
గడప దాటితే పిదప బుద్ధులొస్తాయని
మొట్టిందీ మీరే
వంటగదిలోనే తిరుగాడమని నెట్టిందీ మీరే
ఇల్లు వదిలితే వంచిన తల ఎత్తకుండా తిరిగి
రమ్మందీ మీరే
మా మానాన మేం బతుకుతుంటే కామపు
చూపులు గుచ్చేదీ మీరే
ఏ తప్పూ చేయకపోయినా మమ్ము తుప్పల్లో
శవం చేసేదీ మీరే
తాళికడితే తరతరాల దాస్యమంటకట్టేదీ మీరే
మీ పిల్లలకు తల్లిగా ఏ హక్కులు లేని బాధ్యత
లంటకట్టిందీ మీరే
బూట్ల కిందే నిర్దాక్షిణ్యంగా నలిగిపొమ్మని
శాసించేదీ మీరే
ఎంతిచ్చినా కట్నాలు చాల్లేదని కాటికంపేదీ
మీరే
మరి ఇప్పుడు...!
ఏకంగా భూమండలం కక్ష్య దాటుకొని
నిగర్వంతో మేం నింగిలోకి దూసుకుపోతే..
నిబిడాశ్చర్యంలోంచి తేరుకొని.. మా ఇంతి!
అని మీసాలు మెలేసేదీ మీరే!
అనుకోని అవాంతరమేదైనా వచ్చి నేలకు
మేం
రాలిపోతే!
ఆడపిల్లకు ఎందుకివన్నీ! అని నిర్దాక్షిణ్యంగా
మళ్ళీ మీరే.

- భీమవరపు పురుషోత్తమ్,
సెల్ : 9949800253.

మత విద్వేష దాడులకు ప్రతిఘటన

వ్యాఖ్య

సంఘ పరివార్ రాజకీయ వ్యవస్థలోకి అంతకంతకూ ఎక్కువగా మతతత్వ విషాన్ని ఎక్కిస్తున్నది. సామాన్య జనంలో, అధికార యంత్రాంగంలో పెరుగుతున్న దాని మద్దతుదారులు ముస్లింలపై లెక్కలేనన్ని దాడులకు కారణమవుతున్నారు. ఈ దాడులకు పిల్లలు, శిశువులు కూడా లక్ష్యాలుగా మారుతున్నారని ఇటీవలి ఘటనలు వెల్లడించడం మరీ విషాదకరం.

మహారాష్ట్ర సింధుర్గ్ జిల్లాలో చిన్న పట్టణం మాల్వన్‌లో పదిహేనేళ్ల వయసుగల ఒక ముస్లిం కుర్రాణ్ని పోలీసులు నిర్బంధించారు. అతని తల్లిదండ్రులను కూడా అరెస్టు చేశారు. వారికి వున్న చిన్న షాపును మునిసిపల్ కార్పొరేషన్ ఫిబ్రవరి 25న నేలమట్టం చేసింది. విశ్వహిందూ పరిషత్‌కు చెందిన ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్.ఐ.ఆర్ దీనంతటికి ఆధారమైంది. తాను ఆ బాలుని ఇంటి ముందు నుంచి పోతుండగా ఆ అబ్బాయి భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ తిలకిస్తూన్న సమయంలో పాకిస్తాన్ అనుకూల నినాదాలు వినిపించాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాడూ బొంగరం లేని ఈ ఫిర్యాదు ఎలాంటిదో తెలిసి కూడా ఎలాంటి దర్యాప్తు జరపకుండానే పోలీసులు ఆ బాలుడి ఇంటికి వచ్చారు. భయంతో హడలిపోయిన ఆ అబ్బాయిని బలవంతంగా లాక్కుపోయారు. అతని తల్లిదండ్రులను జైలుకు పంపేసి అతన్ని మాత్రం పరిశీలన గృహానికి చేర్చారు. భారతీయ న్యాయ సంహిత 196వ సెక్షన్ (అంటే మతం ప్రాతిపదికగా వివిధ తరగతుల మధ్య శతృత్వం సృష్టించడం), సెక్షన్ 1973(5) (జాతీయ సమైక్యతకు హాని చేసే ఆరోపణలు, నిర్ధారణలు చేయడం), సెక్షన్ 3(5) (ఒక పథకం ప్రకారం వేర్వేరు వ్యక్తులు అనేకమంది కలిసి చర్యలు చేపట్టడం) కింద వారిపై ఆరోపణలు చేశారు. మైనార్టీలకు వ్యతిరేకంగా సిగ్గుచేటైన రీతిలో పద్ధతి ప్రకారం నిరంతరాయంగా బనాయించబడుతున్న కేసులు ఇవే. నిజానికి వీటికి అసలైన కారకులుగా వున్న హిందూత్వ విద్వేష ప్రచారకులను మాత్రం యథేచ్ఛగా వదిలివేస్తున్నారు.

> అధికార యంత్రాంగం సుప్రీం కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేయడానికి సిద్ధపడటం, మహిళలు, శిశువులపై పోలీసు సిబ్బంది నేరాలకు పాల్పడటం జరుగుతున్న వేళ వారికి వ్యతిరేకంగా ప్రజల నిరసన ప్రజ్వరిల్లాల్సిన అవసరముంది. సంఘ పరివార్ తీసుకొస్తున్న ఈ విభజన రాజకీయాలను గట్టిగా తిప్పికొట్టవలసిన అవసరం ఎప్పటికంటే ఇప్పుడు మరింత తక్షణావసరంగా ముందుకొస్తున్నది. అల్వార్ అమానుషం నేపథ్యంలో ఆ అభాగ్య ముస్లిం కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రజాస్వామిక శక్తులన్నీ ఒక్కుమ్మడిగా కదలవలసి వుంది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

విధ్వంసంతో భయోత్పాతం

ఆ మరుసటి రోజున కొంతమంది మోటారు సైకిల్ ప్రదర్శన జరిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ కుటుంబాన్ని... వుంటున్న చోటు నుంచి తరిమేయాలని వారు కోరారు. అదేరోజు వారి తుక్కు కొనుగోలు దుకాణాన్ని ధ్వంసం చేశారు. ఆ తల్లిదండ్రులకు బెయిల్ రాగా ఆ పిల్లవాడిని మామయ్యకు అప్పగించారు. అయితే వారి కష్టాలు అంతటితో ముగియలేదు. వారికి అసలే జీవనోపాధి లేకుండా పోయింది. వారి పిల్లాడు భయోత్పాతంతో హడలిపోయి నోరు తెరచి మాట్లాడటానికే జంకుతున్నాడు. కాగా ఈ ఘటన నుంచి సాధ్యమైనంత రాజకీయ లబ్ధి పొందడాని స్థానిక బిజెపి ఎం.ఎల్.ఎ నిలేష్ రాణే ప్రయత్నిస్తున్నారు. ఆ బాలుడి తండ్రి అత్యంత అనుమానాస్పదమైన వ్యక్తి అనీ, ఆ జిహాదీని జిల్లా నుంచి పంపించేయడానికి తను చేయగలిగిందంతా చేస్తానని చిందులు తొక్కుతున్నారు.

చిన్న పిల్లలు విషపూరితమైన మతదాడులకు బలవుతున్నారనేది ఒకటైతే అతన్ని అరెస్టు చేసిన పోలీసులు అమానుషంగా చట్ట విరుద్ధంగా ప్రవర్తించారు. మునిసిపల్ అధికారులు అతని తండ్రి దుకాణాన్ని బుల్డోజర్లతో ధ్వంసం చేశారు. ముందుగా చట్టబద్ధమైన అనుమతి తీసుకోకుండా బుల్డోజర్లు వాడరాదనే సుప్రీంకోర్టు తాజా తీర్పును కూడా తోసి రాజని ఈ విధ్వంసానికి పాల్పడ్డారు.

కసికందు బలి

మాల్వన్ తర్వాత దాన్ని వెంటనంటి అంతకన్నా ఘోరమైన ఘటన జరిగింది. మార్చి 2న రాజస్థాన్ అల్వార్ జిల్లాలో పోలీసులు బాగా రాత్రి వేళ ఇమ్రాన్ ఇంటిపై దాడి చేశారు. మహిళా పోలీసులు లేకుండానే వెళ్లారు. ఇమ్రాన్ భార్య రజిదా, నెల కూడా నిండని తన బిడ్డ అలిష్తా నిద్రపోతున్నారు. పోలీసులు రజిదాను ఇంట్లో నుంచి వీధిలోకి ఈడ్చడమేగాక కొంతమంది ఆమె మంచం పైకి దూకి ఆ బిడ్డను నలిపేయడంతో అక్కడే ప్రాణం పోయింది. ఆ పోలీసులు వారంట్ తీసుకుపోవడంగానీ ముందే నోటీసు జారీ చేయడంగానీ జరగలేదు. రోజు కూలీగా పనిచేసే ఇమ్రాన్‌కు ఎలాంటి నేర చరిత్ర కూడా లేకపోయినా ఇలా జరిగింది. ఆ కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలని ప్రయత్నించారుగానీ ఎవరూ పట్టించుకోలేదు. ఆ మరురోజు ఇరు మతాలకూ చెందిన అనేకమంది గ్రామస్తులు దీనిపై ఎస్.పి కార్యాలయం ముందు ప్రదర్శన జరపగా ఎఫ్.ఐ.ఆర్ నమోదైంది.

పొంచిన ప్రమాద సంకేతం

మతతత్వ విద్వేషంతో పోలీసు సిబ్బంది అమ్మ చేతుల్లోని అమాయక కసికందుపై అమానుషమైన నేరానికి పాల్పడ్డం ఓ ప్రమాదకర సంకేతం. సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్, రాష్ట్ర కార్యదర్శి కిషన్ పరీఖ్‌ల నాయకత్వంలో ఒక ప్రతినిధి బృందం మార్చి 4న అల్వార్‌లో ఆ కుటుంబాన్ని సందర్శించి పోలీసులు ఘోర నేరానికి పాల్పడినట్టు ధృవీకరించింది. అపరాధులైన పోలీసులపై వెంటనే చర్య తీసుకోవాలనీ, హత్యానేరం నమోదు చేసి విచారించాలని వారు డిమాండ్ చేశారు.

అధికార యంత్రాంగం సుప్రీం కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేయడానికి సిద్ధపడటం, మహిళలు, శిశువులపై పోలీసు సిబ్బంది నేరాలకు పాల్పడటం జరుగుతున్న వేళ వారికి వ్యతిరేకంగా ప్రజల నిరసన ప్రజ్వరిల్లాల్సిన అవసరముంది. సంఘ పరివార్ తీసుకొస్తున్న ఈ విభజన రాజకీయాలను గట్టిగా తిప్పికొట్టవలసిన అవసరం ఎప్పటికంటే ఇప్పుడు మరింత తక్షణావసరంగా ముందుకొస్తున్నది. అల్వార్ అమానుషం నేపథ్యంలో ఆ అభాగ్య ముస్లిం కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రజాస్వామిక శక్తులన్నీ ఒక్కుమ్మడిగా కదలవలసి వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' మార్చి5 సంపాదకీయం)

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

CanFinHomes Ltd
(Sponsor: CANARA BANK)
HOME LOANS ♦ DEPOSITS
Translating Dreams into Reality

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
బ్రాంచి ఆఫీస్ : డి.నెం.76-14-95/11, 1వ అంతస్తు, ఆర్‌టిసి వర్క్‌షాప్ రోడ్డు, భవానీపురం, గొల్లపూడి, విజయవాడ-520012. ఫోన్ : 0866-2975223, 76250 79223
ఇ-మెయిల్ : gollapudi@canfinhomes.com
CIN No.L85110KA1987PLC008699

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) స్థిరాస్తి కొరకు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని క్రింద **కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారునకు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ.20,07,359/- (అక్షరాల ఇరవై లక్షల ఏడు వేల మూడు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్యవడ్డీ మరియు ఇతర అయిన ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వి నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ఋణగ్రహీతలు : శ్రీ యర్రంరెడ్డి పెద్ద పైదా రెడ్డి గారి తండ్రి గారు శ్రీ యర్రంరెడ్డి అశోక్ రెడ్డి మరియు శ్రీ యర్రంరెడ్డి అశోక్ రెడ్డి గారి ఇతర చట్టరీత్యా వారసులు** గార్లను కోరుతూ **తేది.02.01.2025 న డిమాండ్ నోటీసు** జారీచేశారు.

ఋణగ్రహీతలు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.06.03.2025** న దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనత** తీసుకొన్నారు.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తి విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ.20,07,359/- (అక్షరాల ఇరవై లక్షల ఏడు వేల మూడు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ **కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు
ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రెవెన్యూ డివిజన్, ఆర్.ఎస్.నెం.185, యు.డి.ఎ.ఎల్.పి.నెం. 70/1981, దగ్గరలో గల డి.నెం.18-729, కానూరు గ్రామం ఏరియా నందు విస్తీర్ణం 145-2 చ॥గ॥లు లేదా 121-40 చ॥మీ॥లులోని "గొల్లా'స్ రెసిడెన్సీ" అను పేరుతో ఉన్న అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్-1 తో కలదు. **హద్దులు : తూర్పు :** దొడ్డపనేని రమాదేవి గారి ఫ్లాట్ - అ॥లు 22.0, **దక్షిణం :** ముప్పవరపు నాగేశ్వర రావు గారి ఆస్తి - అ॥లు 59.5, **పడమర :** అ॥ల 33.0 వెడల్పు పంచాయితీ రోడ్డు - అ॥లు 22.0, **ఉత్తరం :** బొప్పన అరుణ కుమారి గారి ఆస్తి - అ॥లు 59.5 అ॥లు.

అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న విస్తీర్ణం 24-00 చ॥గ॥లులోని **"గొల్లా'స్ రెసిడెన్సీ"** రెండవ అంతస్తులోని ప్లింత్ ఏరియా 600 చ॥అ॥లుతో ఫ్లాట్ నెం. ఎస్ఎఫ్-1 మరియు కామన్ ఏరియా 30 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ 100 చ॥అ॥లుతో అన్ని సదుపాయాలు మరియు ఈజిమెంట్ హక్కులతో కలదు. **హద్దులు : తూర్పు :** మెట్లు, లిఫ్ట్ మరియు కామన్ కారిడార్, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

తేది : 07.03.2025 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : గొల్లపూడి — కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

విద్యా రంగంలో సంస్కరణలు రావాలి

• యుజిసి చైర్మన్ జగదీశ్ కుమార్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

విద్యా రంగం సంస్కరణలతోనే దేశ ముఖచిత్రం మారుతుందని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ఆచార్య మామిడాల జగదీశ్ కుమార్ అన్నారు. సృజనాత్మకత, సరళత, ఎంపికల ద్వారా ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా విశ్వవిద్యాలయాల గ్రాంట్స్ సంఘం పలు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాలను విజయవాడలోని పివి సిద్ధార్థ కళాశాలలో ఆయన శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు.

ఈ సందర్భంగా సిద్ధార్థ లోగోను ఆవిష్కరించి, జిబిజిను విడుదల చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో మూడోవంతుల మంది ఉన్నత విద్య, సాంకేతిక విద్యలకు దూరమవుతున్నారని, వేరే రంగాల్లో స్థిరపడిన అనుభవం, అర్హతలున్నవారు యువతరాన్ని తీర్చిదిద్దడానికి బోధన రంగంలోకి రావాలని కోరారు. మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్న భారతదేశం వైపు ప్రపంచం చూస్తోందని, దేశంలో పరిశోధనలు పెరగాలని, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యా సంస్థలు నూతన ఆలోచనలు పంచుకోవాలని, సృజనాత్మకత పెంపొందించాలని సూచించారు. ప్రాంప్ట్ ఇంజనీర్లకు మంచి డిమాండ్ ఉందని, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కోర్సులు భవిష్యత్తుని శాసిస్తాయని తెలిపారు. డిగ్రీలో సబ్జెక్టులతో సంబంధం లేకుండా విద్యార్థి నచ్చిన పిజి కోర్సు చేసే వెసులుబాటును యుజిసి తీసుకురావడం వల్ల ఉన్నత విద్యను గాడిన పెట్టే ఆలోచన ఉందన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ కుమార్‌ను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు సత్కరించారు. 1975లో స్థాపన జరిగిన నాటి నుంచి గత ఐదు దశాబ్దాల కాలంలో 18 విద్యాసంస్థలను విజయవంతంగా నడుపుతూ సిద్ధార్థ సాధించిన విజయాలను అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన బుర్రకథ, శాస్త్రీయ నృత్యం, జానపద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్వర్ణోత్సవ సభలో మాట్లాడుతున్న యుజిసి చైర్మన్ జగదీశ్ కుమార్

పేర్ని నానికి ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

రేషన్ బియ్యం మాయం కేసులో వైసిపి నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నానికి శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. బందరు తాలూకా పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అలాగే కేసుకు చెందిన వాళ్లను ప్రలోభపెట్టకూడదని, భయపెట్టకూడదని, దర్యాప్తునకు సహకరించాలని, పిలిచినప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. పేర్ని నాని భార్య జయసుధ నిర్వహిస్తున్న గోదాములోని బియ్యం బస్తాలు తగ్గడంపై గుర్తించి రూ.1.70 కోట్ల మొత్తాన్ని ఆమె ప్రభుత్వానికి చెల్లించారని హైకోర్టు తీర్పులో ప్రస్తావించింది. గోదాములో పనిచేస్తున్న మానసతేజ తన ఖాతా నుంచి పేర్ని నానికి రూ.1.50 లక్షలు వచ్చాయన్నదే ప్రధాన ఆరోపణనని, ఈ కారణంగా నానిని నిందితుడిగా చేర్చారని చెప్పింది. ఇది బిఎన్ఎస్ సెక్షన్ 316(5) కింద శిక్షర్హమైన నేరం కిందకు రాదని తెలిపింది. ఇతర నేరాలన్నీ కూడా ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడేవేనని గుర్తు చేసింది.

shubham
శుభం హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: 425, ఉద్యోగ్ విహార్ ఫేజ్ 4, గుర్గామ్-122015 (హర్యానా)
ఫోన్: 0124-4212530/31/32, ఇ-మెయిల్: customercare@shubham.co వెబ్‌సైట్: www.shubham.co

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే దిగువ సంతకందారుడు అయిన శుభం హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఇకపై శుభం గా పిలువబడుతుంది) యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ పేర్కొన్న నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగిచెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమెకు అందించిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారు స్వాధీనపరచుకోవడమైనది.
ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు శుభం హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కు ఇక్కడ క్రింద వివరించిన మొత్తం చెల్లించి జరుపవలెను.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు అందుబాటులోవున్నా సమయం మేరకు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర సం.	లోన్ నెం./ రుణగ్రహీతల పేరు	డిమాండ్ నోటీసు తేది & మొత్తం	సెక్యూర్డ్ అసెట్	అనుబంధ తేది
1	Loan No. OVDA2302000005058720 కౌతారపు సోమశేఖర రావు, కౌతారపు శ్రీదేవి.	23-12-2024 & ₹ 15,49,123/-	డి.నెం.330/5, బ్లాక్ నెం.11, డోర్ నెం.41, కనగాల గ్రామం మరియు పంచాయతీ, చెరుకుపల్లి మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522236	05-03-2025

ప్రదేశం : గుర్గామ్ — అధీకృత అధికారి
తేది : 07-03-2025 — శుభం హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు

అన్ని రంగాలను విస్మరించిన బడ్జెట్

• రౌండ్ టేబుల్‌లో పలువురు వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ

పేద, మధ్యతరగతి ప్రజలతోపాటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను రాష్ట్ర బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని పలు రంగాలకు చెందిన నాయకులు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆయా రంగాలకు సక్రమంగా కేటాయింపులు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. "ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి - 2025-26 బడ్జెట్ పరిశీలన" అంశంపై శుక్రవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్‌టేబుల్ జరిగింది. ఎంబివికె కమిటీ సభ్యులు ఎస్.రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేసే దిశగా బడ్జెట్ ఉన్నట్లుందని... ఈ బడ్జెట్‌పై పునఃసమీక్షించి వ్యవసాయ, సాగునీటి రంగాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిధుల కేటాయింపు పెంచాలని కోరారు. ప్రస్తుతం బడ్జెట్లో చూపిన కేటాయింపులను పరిశీలిస్తే వచ్చే ఐదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తికాదని స్పష్టం చేశారు. పంటలకు గిట్టుబాటు ధరల కోసం ధరల స్థిరీకరణకు కనీసంగా బడ్జెట్లో రూ.4 వేల కోట్లు కేటాయించాలన్నారు. టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎంవి ఆంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేవన్నారు. ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ రూ.80 వేల కోట్ల రెవెన్యూ లోటును ఎలా భర్తీ చేస్తారో స్పష్టత ఇవ్వలేదన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీల్లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని తెలిపారు. ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేసే పరిస్థితి లేదన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి కనీసంగా బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పిఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ మాట్లాడుతూ సాంస్కృతిక రంగం అభివృద్ధికి వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. ఐద్వా నాయకులు సుజాత మాట్లాడుతూ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సును అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక వేదిక నాయకులు గుండు నారాయణ, నాయకులు రాజు, ఎంబివికె బాధ్యులు యువి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ICICI Home Finance
లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన
రిజిష్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్ల కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్) ముంబయి-400051
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కుర్ల రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400059.
బ్రాంచ్ ఆఫీసు: 54-20-1బి, యూనిట్ నెం.4, 3వ అంతస్తు, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ కాలనీ, రెవెన్యూ వార్డు నెం.2, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007.
ఏదైతే,
(10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపులతో)

ఋణగ్రహీత వివరములు: శ్రీ కర్లపాలెం రవికిరణ్ (ఋణగ్రహీత), తండ్రి: రామకృష్ణ, డి.నెం. 1-2-107-31, మారుతీనగర్, కొత్తపేట, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500036.
హామీదారులు: నిల్.

స్థిరాస్తి వివరములు
సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం.2879/2013, తేది: 07-11-2013:
ఆంధ్రప్రదేశ్, విజయవాడ, నున్న, పవర్ గ్రిడ్ దగ్గర, గుణదల రోడ్డు, ఆర్.ఎస్.నెం. 722/2ఎ, మహేశ్వరి హైట్స్ అపార్ట్‌మెంట్, 2వ అంతస్తులో నివాస ఫ్లాట్ నెం. 302 శ్రీ కర్లపాలెం రవి కిరణ్ గారికి చెందినది. ఫ్లాట్‌కి హద్దులు: **తూర్పు:** ఫ్లాట్ నెం.301, **దక్షిణం:** శూన్యాకాశము, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** శూన్యాకాశము. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు: తూర్పు:** డొంక, **దక్షిణం:** గొల్లపూడి పంపింగ్ స్కీమ్ కెనాల్, **పడమర:** అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి సీతారావమ్మ గారి ఆస్తి, **ఉత్తరం:** బడిస దుర్గ గారి ఆస్తి.

రిజర్వు ధర (రూ.) : రూ. 20,34,000/-, ధరావత్తు ధర (రూ.) : రూ. 2,03,400/-, బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://baanknet.com** మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్: **https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx** నందు చూడగలరు. అధీకృత అధికారి/చీఫ్ మేనేజర్ శ్రీమతి టి.శ్రీలక్ష్మి కి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేదీ నందు మొబైల్ నెం.7306142248, మెయిల్ ఐడి: ubin0801453@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు.

తేది: 04-03-2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

ప్లే-ఆఫ్స్ రేసులోకి గుజరాత్

- ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసిన హర్లీన్
- ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) సీజన్-2025 ప్లే-ఆఫ్స్ రేసులోకి గుజరాత్ జెయింట్స్ జట్టు దూసుకొచ్చింది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ఐదు వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 177పరుగులు భారీస్కోర్ నమోదు చేసింది. ఆ లక్ష్యాన్ని గుజరాత్ జట్టు 19.3ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 178పరుగులు చేసి గెలిచింది. ఈ గెలుపుతో 7మ్యాచ్‌లు ముగిసేసరికి గుజరాత్ జట్టు 8పాయింట్లతో రెండోస్థానానికి ఎగబాకింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ ఓపెనర్ మూనీ(44), హర్లీన్(70నాటౌట్), గార్డనర్(22), డోటిన్(24) బ్యాటింగ్‌లో రాణించారు. ఢిల్లీ బౌలర్లు శిఖా పాండే, జొనాసెన్‌కు రెండేసి, మిన్ను మణికి ఒక వికెట్ దక్కాయి. అంతకుముందు ఢిల్లీ ఓపెనర్ మెగ్ లానింగ్(92), లిచ్‌ఫీల్డ్(40) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 83పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి శుభారంభం దక్కింది. షెఫాలీ వర్మ ఔటయ్యాక ఢిల్లీ జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. గుజరాత్ బౌలర్లు మేఘ్నా సింగ్ మూడు, డోటిన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

రిటైర్మెంట్ వెనక్కి: సునీల్ ఛెత్రీ



కోల్‌కతా: భారత ఫుట్‌బాల్ దిగ్గజం, టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రీ రిటైర్మెంట్‌నుంచి వెనక్కి వచ్చాడు. ఈ విషయాన్ని ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఎఐఎఫ్ఎఫ్) శుక్రవారం ట్విటర్ వేదికగా వెల్లడించింది. ఏడాది గడుస్తున్నా భారత జట్టులో తన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేకపోవడంతో రిటైర్మెంట్ విషయంలో ఛెత్రీ మనసు మార్చుకున్నాడని అందులో పేర్కొంది. గతేడాది జూన్ 6న రిటైర్మెంట్ ప్రకటించాడు. కోల్‌కతాలో కువైట్‌తో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్ ఛెత్రీకి చివరిది. ఫిఫా ఇంటర్నేషనల్ విండో కోసం ప్రకటించిన 26మంది ఆటగాళ్ల భారత జట్టులో ఛెత్రీకి చోటు దక్కింది. ఛెత్రీ అంతర్జాతీయ కెరీర్ వీడ్కోలు పలికినప్పటికీ.. ఇండియన్ సూపర్ లీగ్‌లో బెంగళూరు ఎఫ్‌సికి ప్రాతినిధ్యం వహిస్తూనే ఉన్నాడు. ఈ సీజన్‌లో ఛెత్రీ 12 మ్యాచుల్లో 23 గోల్స్ చేశాడు.

తమిళనాడులో ఘోర ప్రమాదం

- ఏడుగురు మృతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, యంత్రాంగం

తమిళనాడులో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. తిరుత్తణి వద్ద బస్సు, లారీ ఢీకొనడంతో ఏడుగురు మరణించారు. 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు.. తిరువళ్లూరు జిల్లాలోని తిరుత్తణి సమీపంలో కోలిగంగ్ రాష్ట్ర రహదారిపై బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. పోలీసులు, సంఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్నిస్ క్రీడాకారిణులకు శుభవార్త

- 12నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు: డబ్ల్యుటిఎ

దుబాయ్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(డబ్ల్యుటిఎ) మహిళా క్రీడాకారిణులకు శుభవార్త తెలిపింది. మహిళల టెన్నిస్ టూర్‌లో పాల్గొనే గర్భిణీ క్రీడాకారిణులు 12 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. అలాగే భాగస్వామి, సరోగసీ, దత్తత ద్వారా తల్లిదండ్రులుగా మారిన వారు కూడా రెండు నెలలు వేతనంతో కూడిన సెలవులను పొందవచ్చని శుక్రవారం తెలిపింది. ఇక స్వతంత్ర కాంట్రాక్ట్, స్వయం ఉపాధితో నేరుగా పాల్గొనే ప్లేయర్లకు ఈ అవకాశం ఉండదని డబ్ల్యుటిఎ సిఇఓ పోర్టియా ఆర్చర్ తెలిపారు. దీంతో డబ్ల్యుటిఎ ర్యాంకింగ్స్‌లో ఉన్న 300మంది కంటే ఎక్కువమంది ఇందుకు అర్హులు కానున్నారు. ఇది జనవరి 1, 2025నుంచి అమలులోకి రానుంది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ.
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1) మెస్సర్స్ సాయి మాధవ పౌల్ట్రీస్ ప్రై.లి., రిజిస్టర్డ్ ఆఫీస్ : ఫ్లాట్ నెం. ఎస్1, శ్రీ లక్ష్మీ అపార్ట్‌మెంట్స్, 6వ లైన్, బృందావన్ గార్డెన్స్, గుంటూరు, ఎపి - 522006. **1 ఎ) మెస్సర్స్ సాయి మాధవ పౌల్ట్రీస్ ప్రై.లి.,** డి.నెం. 581/1,2,3,4 & 5, కొచ్చర్ల గ్రామం, ఈపూరు మండలం, పల్నాడు జిల్లా, ఎపి. **1 బి) శ్రీ పరుచూరి మాధవరావు,** తండ్రి : గోపాలకృష్ణ (మేనేజింగ్ డైరెక్టర్), డి.నెం. 1-176, చిన్న కొండ్రుపాడు, నడింపాలెం, గుంటూరు జిల్లా, ఎపి - 522019. **1 సి) శ్రీ పరుచూరి నాగరాజకుమారి,** తండ్రి : మాధవరావు (డైరెక్టర్), డి.నెం. 1-176, చిన్న కొండ్రుపాడు, నడింపాలెం, గుంటూరు జిల్లా, ఎపి - 522019. **సహ ఋణగ్రహీత / హామీదారు : 2 ఎ) శ్రీ పరుచూరి సునీల్ కృష్ణ,** తండ్రి : మాధవరావు, ఫ్లాట్ నెం. ఎస్1, శ్రీ లక్ష్మీ అపార్ట్‌మెంట్స్, 6వ లైన్, బృందావన్ గార్డెన్స్, గుంటూరు, ఎపి - 522006. **2 బి) శ్రీమతి పరుచూరి వెంకట శ్రీలక్ష్మి,** భర్త : సునీల్ కృష్ణ, ఫ్లాట్ నెం. ఎస్1, శ్రీ లక్ష్మీ అపార్ట్‌మెంట్స్, 6వ లైన్, బృందావన్ గార్డెన్స్, గుంటూరు, ఎపి - 522006.
విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ సాయి మాధవ పౌల్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 03-11-2022** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.
పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 17-02-2023** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.
ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచ్ కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.
మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.
విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.
ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 03-11-2022** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి
తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు ఇక్కడ వివరించబడ్డాయి :
శ్రీమతి పరుచూరి వెంకట శ్రీలక్ష్మి, భర్త : సునీల్ కృష్ణ గారి పేరిట ఎ.పి., ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, పటమటలంక, డి.నెం. 40-17-36, ఆర్.ఎస్.నెం. 30/6, పటమట గ్రామ పంచాయితీ వద్ద మొత్తం 1225.00 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఆస్తి నందు నిర్మించిన శ్రీనివాస టవర్స్ నందు అవిభక్త, పేర్కొనబడని మరియు విడదీయరాని వాటా 47.67 చ॥గ॥ల భూమితో పాటు ప్లింత్ ఏరియా 1155 చ॥అ॥ విస్తీర్ణంతో గ్రౌండ్ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 4కి చెందిన రెసిడెన్షియల్ ఫ్లాట్. (రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 971/2002, తేది : 16-03-2002) **రెసిడెన్షియల్ ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము మరియు ఫ్లాట్ నెం. 3, **పడమర :** శూన్యాకాశము మరియు మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం :** శూన్యాకాశము మరియు ఫ్లాట్ నెం. 5, **దక్షిణం :** శూన్యాకాశము మరియు రిధమ్ టవర్స్ ఆస్తి. **భూమికి హద్దులు : తూర్పు :** గూడూరు వెంకటేశ్వరరావు మరియు జొన్నవిత్తుల పూర్ణచంద్రశర్మ గార్ల ఆస్తి, **పడమర :** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం :** పి. జనార్ధనరావు తదితరులకు విక్రయించిన ఆస్తి, **దక్షిణం :** రిధమ్ టవర్స్ ఆస్తి.

తేది : 17-01-2025 **అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌పేట బ్రాంచి-01451
డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ-520002.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1. శ్రీ మంగళగిరి బాలాజీ వీర కోటేశ్వరరావు (ఋణగ్రహీత), తండ్రి: మనవల దాస్, ఫ్లాట్ నెం.413, మహేశ్వరి హైట్స్, గుణదల రోడ్డు, నున్న, విజయవాడ-521212. **హామీదారు/లు: 1. శ్రీ మంగళగిరి శేషు కుమార్ (కో ఆబ్లిగెంట్),** తండ్రి: మనవల దాస్, డి.నెం: 15-79/ఎ, హరిజనవాడ, గన్నవరం, విజయవాడ-520012.
విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి (01451) వారికి శ్రీ మంగళగిరి బాలాజీ వీర కోటేశ్వరరావు కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 14-09-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.
పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.19-11-2024**న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.
ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి (01451)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.
మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.
విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి పక్రియ కొనసాగిస్తుంది.
ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.14-09-2024** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి
తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు ఇక్కడ వివరించబడ్డాయి:
ఆస్తి: 1) టైటిల్ డీడ్‌ల డిపాజిట్ ద్వారా తనఖాని సృష్టించడానికి భద్రతగా అందించబడిన స్థిరాస్తి యొక్క పూర్తి వివరణ. ఏ) ఆర్.ఎస్.నెం.722/2ఏ, బి) డోర్.నెం. లేదు, సి) విస్తీర్ణం: 2776.47చ.గ.లలో 30 చ.గ.ల అవిభక్త / పేర్కొనబడని ఉమ్మడి హక్కులు గల స్థలం. అమ్మకపు ఒప్పందం ప్రకారం తేదీ: 11-11-2013 ప్రకారం మొత్తం స్థలంలో 722 చ.అ.ల ప్లింత్ ఏరియాతో మహేశ్వరి హైట్స్‌లోని 3వ అంతస్తులో అసంపూర్తిగా ఉన్న ఫ్లాట్ నెం: 413. డి) లోకేషన్ & హద్దులు: **షెడ్యూల్-ఏ:** కృష్ణాజిల్లా, నున్న గ్రామపంచాయితీ / గ్రామం, విజయవాడ రూరల్ మండలం పరిధిలో ఎస్.ఆర్.ఓ నున్నకు హద్దులు: **తూర్పు:** డొంక, **దక్షిణం:** గొల్లపూడి పంపింగ్ స్కీమ్ కాలువ, **పడమర:** అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి & అన్నపరెడ్డి సీతారావమ్మ గార్ల ఆస్తి, **ఉత్తరం:** బడిస దుర్గ గారి ఆస్తి, **షెడ్యూల్-బి:** ఫ్లాట్ నెం: 413, మహేశ్వరి హైట్స్‌లోని 3వ అంతస్తులో 722 చ.అ.ల ప్లింత్ ఏరియా, 100 చ.అ.ల కామన్ ఏరియా, 100 చ.అ.ల కార్ పార్కింగ్‌తో పాటు అన్ని సౌలభ్య హక్కులతో 'ఏ' షెడ్యూల్ స్థలంలో నిర్మించబడింది. **ఆస్తికి హద్దులు: తూర్పు:** ఫ్లాట్ నెం.412, **దక్షిణం:** శూన్యాకాశము, **పడమర:** మెట్లు మరియు ఉమ్మడి కారిడార్, **ఉత్తరం:** కామన్ కారిడార్.

తేది: 04.03.2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

బంగారం అక్రమ రవాణా కేసులో..

నటి రాన్యా రావుకు మూడు రోజుల కస్టడీ

బెంగళూరు : బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన నటి రాన్యా రావుకు బెంగళూరులోని ఒక కోర్టు మూడు రోజుల డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) కస్టడీకి అనుమతించింది. దుబాయ్ నుంచి 14.2 కేజీల బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తూ ఈవారం ప్రారంభంలో కెంపెగౌడ అంతరాష్ట్రీయ విమానాశ్రయంలో ఆమె పట్టుబడ్డారు. రాన్యారావును తమ కస్టడీకి అనుమతించాలని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టును డిఆర్ఐ అభ్యర్థించింది. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాల్సి ఉందని, ఈ కేసు 'దేశ వ్యతిరేక కార్యకలాపాలకు' సంబంధించినదిగా అనుమానం ఉందని కోర్టుకు డిఆర్ఐ తెలిపింది. విమానాశ్రయంలో 34 ఏళ్ల నటి నుంచి రూ. 12.56 కోట్ల విలువైన బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నట్లు డిఆర్ఐ అధికారులు తెలిపారు. ఈ తరువాత ఆమె నివాసంలో నిర్వహించిన సోదాల్లో రూ. 2.06 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 2.67 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో ఇప్పటి వరకూ మొత్తంగా రూ. 17.29 కోట్ల విలువైన ఆస్తులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గత ఆరు నెలల్లో ఆమె 27 సార్లు దుబాయ్‌కు ప్రయాణం చేశారని, తరచుగా చేస్తున్న ఈ సందర్శనలపై విచారణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.
ఏప్రిల్ 22న పెగాసస్ కేసు విచారణ

ఏప్రిల్ 22న పెగాసస్ కేసు విచారణ

న్యూఢిల్లీ : పెగాసస్ స్పైవేర్‌ను పలువురు ప్రముఖుల ఎలక్ట్రానిక్ పరికరాలకు పంపించడం ద్వారా కేంద్రప్రభుత్వం నిఘాపెట్టిందన్న ఆరోపణలపై ఏప్రిల్ 22న విచారణకు సుప్రీంకోర్టు షెడ్యూల్ చేసింది. ఈ కేసు దాదాపు రెండేళ్ల తర్వాత విచారణకు వచ్చిందని ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదించారు. శుక్రవారం రెండు పిటిషన్లను మాత్రమే విచారణకు షెడ్యూల్ చేసినట్లు సిబాల్ కోర్టుకు తెలపగా, ఏప్రిల్ 22న అన్ని పిటిషన్లను సమగ్రంగా విచారించనున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ తెలిపింది.

బెయిల్ వద్దు, శిక్షే ముద్దు !

ఆగస్టా వెస్ట్ ల్యాండ్ కేసులో మైఖేల్ జేమ్స్

న్యూఢిల్లీ : భద్రతా కారణాల రీత్యా బెయిల్‌పై బయటకు వెళ్లడానికి బదులుగా తన శిక్ష పూర్తి చేసుకుని భారత్‌ను వీడి వెళతానని అగస్టా వెస్ట్ ల్యాండ్ కేసులో మధ్య దళారి క్రిస్టియన్ మైఖేల్ జేమ్స్ చెప్పారు. ప్రత్యేక న్యాయమూర్తి సంజీవ్ అగర్వాల్‌నుద్దేశించి జేమ్స్ శుక్రవారం ఈ విజ్ఞప్తి చేశారు. జేమ్స్‌పై వున్న సిబిఐ, ఇడి కేసుల్లో ఉపశమనం లభించిన తర్వాత ఆయనను బెయిల్‌పై విడుదల చేసేందుకు అవసరమైన బెయిల్ షరతులను ప్రత్యేక కోర్టు విధించింది. ఇడి కేసులో ఢిల్లీ హైకోర్టు ఆయనకు 4వ తేదీన బెయిల్ ఇచ్చింది. సిబిఐ నమోదు చేసిన కేసులో ఫిబ్రవరి 18నే సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ రీతిన విచారణ సాగుతూ వుంటే మరో 25 ఏళ్లయినా విచారణ పూర్తి కాదని కూడా సుప్రీం వ్యాఖ్యానించింది. బెయిల్‌ను మంజూరు చేస్తే ఎలా జైల్లో వుంచుతామంటూ జేమ్స్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. బయటకు వెళ్లడం తనకు సురక్షితం కాదని, అందువల్ల బెయిల్‌ను తాను ఆమోదించనని చెప్పారు. పైగా షశ్యూరిటీ బాండ్లు అందచేయాలంటున్నారని, ఆరేళ్ల జైల్లో వున్న వ్యక్తికి స్థానికంగా ఎలా షశ్యూరిటీలు వస్తాయని ఆయన ప్రశ్నించారు. అయినా ఢిల్లీనే తనకు పెద్ద జైలని ఆయన వ్యాఖ్యానించారు.

ఓటర్లందరికీ ప్రత్యేక ఇపిఐసి నెంబర్లు

న్యూఢిల్లీ : రాబోయే మూడు నెలల్లో దేశంలోని ఓటర్లందరికీ ప్రత్యేకమైన ఎలక్టోర్స్ ఫోటో ఐడెంటిఫికేషన్ కార్డు (ఇపిఐసి) సంఖ్యను జారీ చేయనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇపిఐసి సంఖ్య అనేది కేంద్ర ఎన్నికల సంఘం ప్రతీ ఓటరుకు జారీ చేసే ఓటరు ఐడి కార్డు నంబర్. ఇటీవల కొంత మంది ఓటర్లకు ఒకే ఓటర్ ఐడి కార్డు సంఖ్యలను జారీ చేసినట్లు వివాదం చెలరేగడంతో ఇసి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఒకే ఓటర్ ఐడి కార్డు సంఖ్యలు ఉన్నవారంతా నకిలీ ఓటర్లు కాదని ఇసి శుక్రవారం మరోసారి పేర్కొంది. '100 మందికి పైగా ఓటర్లపై చేసిన నమూనా విచారణలో నకిలీ ఓటర్ ఐడి కార్డు సంఖ్యలు ఉన్నా వీరంతా నిజమైన ఓటర్లు అని వెల్లడయింది' అని ప్రకటనలో తెలిపింది. '2000 సంవత్సరంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు వేర్వేరు ఇపిఐసి సిరీస్ కేటాయించినప్పటికీ.. కొంతమంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు సరైన సిరీస్‌ను ఉపయోగించలేదు. రాష్ట్రాలు /కేంద్రపాలిత ప్రాంతాలు స్వతంత్రంగా ఎన్నికల జాబితా డేటాబేస్‌లను నిర్వహిస్తున్న కారణంగా నకిలీ ఐడి కార్డుల సంఖ్యల కేటాయింపు సమస్యను గుర్తించలేకపోయాం' అని ఇసి పేర్కొంది.

ఏడేళ్ల తర్వాత కాశ్మీర్‌లో బడ్జెట్

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం శుక్రవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. జమ్ముకాశ్మీర్‌లో ఏడేళ్ల అనంతరం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ ఇదే కావడం గమనార్హం. ఈ సందర్భంగా అసెంబ్లీలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఈ ప్రాంతం శాశ్వత శాంతి మార్గంలో ఉందని స్పష్టం చేశారు. యువత, మహిళలకు సాధికారత కల్పించడం, ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడం, రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. సమాజంలోని బలహీనవర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చడం, అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించామని తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.815 కోట్లు కేటాయించామని, దీంతో 2.88 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. పర్యాటక అభివృద్ధికి రూ.390.20 కోట్లు కేటాయించామని తెలిపారు.

శామ్‌సంగ్ కార్మికుల సమ్మె విరమణ

- నేటి నుండి విధులకు హాజరు
- అణచివేత చేపడితే మళ్లీ నిరసన కొనసాగిస్తామన్న సిఐటియు

ఆందోళన చేస్తున్న శామ్‌సంగ్ కార్మికులు

కాంచిపురం : నెల రోజులుగా సాగుతున్న సమ్మెను విరమించినట్లు శుక్రవారం శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయు) ప్రకటించింది. నిరసనలకు దిగారన్న కారణంతో తొలగించిన కార్మికులను తిరిగి విధులకు తీసుకోవడానికి కంపెనీ అంగీకరించిందని తెలిపింది. తిరిగి డ్యూటీలో చేరాల్సిందిగా ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు కార్మికులను కోరిన నేపథ్యంలో యూనియన్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సమ్మె విరమణ శుక్రవారం నుండి అమల్లోకి వస్తుందని కంపెనీ సర్క్యులర్ తెలిపింది. గుర్తింపు కార్డులను అన్‌బ్లాక్ చేయాలన్న కార్మికుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని వారికి బ్యాచ్‌ల వారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని కంపెనీ ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. శనివారం నుండి ఈ శిక్షణా కార్యక్రమం ప్రారంభం కానుంది. శిక్షణా షెడ్యూల్ కార్మికులకు విడిగా పంపిస్తామని తెలిపింది. వెయ్యిమందికి పైగా కార్మికులు ఫిబ్రవరి 5 నుండి సమ్మెకు దిగారు. 23మంది యూనియన్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వారీ సమ్మె చేపట్టారు. శుక్రవారం ఉదయం 7గంటలకు పెద్దసంఖ్యలో కార్మికులు శామ్‌సంగ్ ఫ్యాక్టరీ గేటు వద్దకు చేరుకున్నారు. లోపలకు ప్రవేశించడానికి వారు ప్రయత్నించారు. నిరసనల్లో పాల్గొన్నందుకు ఉద్యోగుల ఐడి కార్డు బ్లాక్ అయినందున ఆ కార్డును తిరిగి యాక్టివేట్ చేయాలని కోరుతున్న దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేయాల్సిందిగా కంపెనీ ప్రతినిధులు కోరారు. శనివారం నుండి వారిని విధులకు అనుమతిస్తామని చెప్పారు. ఇది రాతపూర్వకంగా ఇవ్వాల్సిందిగా యూనియన్ డిమాండ్ చేసింది. మొత్తంగా ఈ సమస్య పరిష్కారం కావడానికి దాదాపు ఐదు గంటలు పట్టింది.

తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి అంగీకరించడంతోనే సమ్మె విరమణ : సిఐటియు

కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి కంపెనీ రాతపూర్వకంగా అంగీకరించిన తర్వాత సమ్మెను ఉపసంహరించినట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సౌందర్యరాజన్, సిఐటియు కాంచిపురం జిల్లా కార్యదర్శి ముత్తుకుమార్ తెలిపారు. యూనియన్ కార్యకలాపాలను అణచివేయడానికి ప్రయత్నించినట్లైతే మళ్లీ నిరసనలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. 23మంది కార్మికులను సస్పెండ్‌చేశారని, వారి విషయంలో రాజీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వారిపై చట్ట ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కంపెనీ చెబుతోంది. తిరిగి ఈ నెల 12న కార్మిక శాఖ అదనపు కమిషనర్ ముందు చర్చలు జరగనున్నాయి.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తాం

- ఇండియా బ్లాక్ పార్టీలతో విస్తృత సంప్రదింపులు
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నేత జైరాం రమేష్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ (సవరణ) బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించేందుకు తమ పార్టీ "అన్ని ప్రజాస్వామ్య మార్గాలను" అనుసరిస్తుందని, ఇండియా బ్లాక్ పార్టీలతో సమన్వయం చేసుకుంటుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ తెలిపారు. ప్రతిపాదిత చట్టంలోని అంశాలు, ఉద్దేశం, పరిధిలకు ఇండియా బ్లాక్‌లోని పార్టీలు కూడా వ్యతిరేకమని ఆయన చెప్పారు. ఇక్కడ శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును సంయుక్తంగా వ్యతిరేకించడానికి బడ్జెట్ సమావేశాల రెండో విడత ప్రారంభానికి ముందు ఇండియా బ్లాక్ పార్టీల మధ్య విస్తృతమైన సంప్రదింపులు జరుగుతాయని చెప్పారు. పార్లమెంటు ఉభయ సభలలోని ప్రతిపక్ష నాయకులు త్వరలో ఈ అంశంపై వేదిక పార్టీలతో సమన్వయం చేసుకుంటారని తెలిపారు. ఇతర పార్టీలు కూడా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. బిల్లును బుల్డోజ్ చేసిన విధానం పార్లమెంట్ జాయింట్ కమిటీ ప్రక్రియను అపహాస్యం చేసిందని ఆయన విమర్శించారు. 'టిడిపి, జెడియు ఎంపిలు కూడా బిల్లు పట్ల చాలా అసంతృప్తిగా ఉన్నారు. కానీ, వారికి వారి సొంత అవసరాలు ఉన్నాయి. వారు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడంతో బిజెపి ముందుకు వెళ్లినట్లు అనిపిస్తుంది" అని ఆయన అన్నారు. జెడియు చీఫ్ నితీష్ కుమార్, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఏమి చేస్తారో తనకు తెలియదని, కానీ వారి నిజస్వరూపం బయటపడుతుందని చెప్పారు. "ఇండియా బ్లాక్ లోక్‌సభ ఎన్నికల కోసం ఏర్పడింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మేము ఒకరితో ఒకరు పోటీ పడాలని నిర్ణయించాం, అదే ఆ వేదిక స్వభావం" అని రమేష్ చెప్పారు. రెండో విడత బడ్జెట్ సెషన్‌లో ఇండియా బ్లాక్ సమన్వయం చేసుకుంటుందని ఆయన తెలిపారు.

భారత్, చైనా సంబంధాల్లో పురోగతి

- సహకార భాగస్వామ్యం సరైన ఎంపిక
- చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి

బీజింగ్ : భారత్, చైనా సంబంధాల్లో గతేడాది కాలంగా సానుకూల పురోగతి చోటుచేసుకుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి చెప్పారు. లడఖ్‌లో నాలుగేళ్ల సైనిక ప్రతిష్టంభనకు స్వస్తి చెబుతూ గతేడాది అన్ని స్థాయిల్లో ప్రోత్సాహకరమైన ఫలితాలు సాధించామని తెలిపారు. వార్షిక పత్రికా సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సరిహద్దు సమస్య లేదా నిర్దిష్ట అంశంపై విభేదాలనేవి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను ప్రభావితం చేయవని చెప్పారు. సంబంధాల్లో సుదీర్ఘ ప్రతిష్టంభన అనంతరం ద్వైపాక్షిక సంబంధాలను చైనా ఏ విధంగా చూస్తోందని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా స్పందించారు. రష్యాలోని కజన్‌లో గతేడాది ఇరు దేశాల అధినేతలు సమావేశమైనప్పుడు సంబంధాల మెరుగుదలకు వారు వ్యూహాత్మక మార్గనిర్దేశాన్ని అందించారని వాంగ్ చెప్పారు. ఆ తర్వాత ఉభయ పక్షాలు కీలకమైన ఉమ్మడి అవగాహనను అనుసరించాయని తెలిపారు. అన్ని స్థాయిల్లో పరస్పర మార్పిడిని బలోపేతం చేయడం, ఆచరణాత్మక సహకారంతో సానుకూల ఫలితాలు సాధించామని తెలిపారు. రెండు ప్రాచీన నాగరికతలు కలిగిన దేశాలుగా సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలు కొనసాగించేందుకు అవసరమైన విచక్షణ, వివేచన ఇరు దేశాలకు వున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. సరిహద్దు సమస్యలు లేదా ఇతర అభిప్రాయ భేదాల కోణంలో ద్వైపాక్షిక సంబంధాలను నిర్వచించడానికి అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. రెండు పెద్ద దేశాలుగా ఇరు దేశాలు కూడా ఒకరి విజయంలో మరొకరి భాగస్వామ్యం వుండాలని చైనా కోరుకుంటుందని అన్నారు. సహకార భాగస్వామ్యం ఉభయ పక్షాలకు సరైన ఎంపిక అని ఆయన వ్యాఖ్యానించారు.

ఇరాన్‌తో 'అణు' చర్చలు!

- చర్చలకు సిద్ధమంటూ ఖమేనీకి ట్రంప్ లేఖ
- రష్యాపై ఆంక్షలు, టారిఫ్‌ల అంశం పరిశీలన

వాషింగ్టన్ : ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు జరపాలని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఇరాన్ నాయకత్వానికి గురువారం ఒక లేఖ రాశారు. దీనివల్ల ఇరాన్‌కే ప్రయోజనాలు వున్నాయని, అందువల్ల వారు చర్చలకు అంగీకరిస్తారని భావిస్తున్నట్లు ఫాక్స్ బిజినెస్ నెట్‌వర్క్ బ్రాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ శుక్రవారం చెప్పారు. "వారు కూడా ఈ లేఖ రావాలని కోరుకుంటున్నారని అనుకుంటున్నాను. ఎందుకంటే మనం ఇంకో అణ్వాయుధాన్ని అనుమతించలేం. కాబట్టి మనం మరో ప్రత్యామ్నాయాన్ని చూసుకోవాల్సి వుంది." అని ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేనీని ఉద్దేశించి ఆయన ఈ లేఖ రాశారు.

రష్యాపై ఆంక్షలు?

ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం కుదిరేవరకు రష్యాపై బ్యాంకింగ్ ఆంక్షలు, టారిఫ్‌లు విధించే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ట్రంప్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతానికి ఉక్రెయిన్‌పై రష్యా తీవ్రంగానే దాడులు జరుపుతోందన్న వాస్తవం ప్రాతిపదికగా పై చర్యలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మరింత జాప్యం జరగకుండా ఇరు దేశాలను చర్చల వేదిక వద్దకు తీసుకురావాల్సి వుందన్నారు.

కెనడా, మెక్సికో దిగుమతులపై సుంకాల పెంపు నెల రోజుల పాటు వాయిదా

కెనడా, మెక్సికోల నుండి వచ్చిన సరుకులపై సుంకాల పెంపు అమలును ట్రంప్ తాత్కాలికంగా నెల రోజుల పాటు వాయిదా వేశారు. తన నిర్ణయాలు మార్కెట్ సంక్షోభానికి కారణమవుతాయన్న వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. ఆ రెండు దేశాలతో వాణిజ్యమనేది ప్రాంతీయ ఒప్పందం పరిధిలోకి వస్తున్నందున లెవీ విధింపునకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ చర్యతో కంపెనీలకు, వినియోగదారులకు కొంత ఉపశమనం లభించినట్లైంది. ఎరువుల ఉత్పత్తికి కీలకమైన పొటాష్ కెనడా నుండి వస్తున్నందున దానిపై కొత్తగా విధించిన 25శాతం లెవీని కూడా ట్రంప్ తగ్గించారు. ఏప్రిల్ 2న మరిన్ని ప్రధానమైన చర్యలు వుంటాయని, ఆ రోజు నుండి మెక్సికో,కెనడాలపై ప్రతీకార సుంకాలు అమలవుతాయని తొలుత ట్రంప్ చెప్పారు.

విద్యా శాఖ వికేంద్రీకరణకు ఆదేశాలు ?

ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లుగా విద్యాశాఖను వికేంద్రీకరించనున్నట్లు ట్రంప్ తెలిపారు. విద్యా శాఖ అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకు బదలాయించనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ మంత్రికి ఆదేశాలు వెళ్లాయి. విద్యా శాఖను వికేంద్రీకరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. 1979లో జిమ్మీ కార్టర్ అధ్యక్షుడిగా వున్న సమయంలో విద్యా శాఖ ఏర్పడింది. సెనెట్‌లో 60ఓట్లు అనుకూలంగా రాకపోతే ఈ చర్య అమల్లోకి రాదు. ఈ వార్తలు డెమొక్రాట్లకు ఆగ్రహం తెప్పించాయి. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఇది దాడి అని ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు భావిస్తున్నారు.

పాలస్తీనియన్ ఖైదీలనూ గౌరవించండి ట్రంప్‌ను కోరిన హమాస్

ఇజ్రాయిల్ విడిచిపెట్టిన పాలస్తీనా ఖైదీలను కూడా గౌరవించాలని హమాస్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరింది. హమాస్ విడుదల చేసిన ఇజ్రాయిల్ ఖైదీలను ట్రంప్ కలిసిన నేపథ్యంలో హమాస్ సీనియర్ నాయకుడు బాసెం నయిమ్ ట్రంప్‌కు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. విడుదలైన పాలస్తీనా రాజకీయ ఖైదీల బాధలను కూడా వినాలని ఆయన కోరారు. ఇజ్రాయిల్ జైళ్లలో ప్రస్తుతం 9,500 మందికిపైగా పాలస్తీనా వాసులు ఖైదీలుగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.

సిరియాలో ఘర్షణలు

- 70 మంది మృతి

గస్తీ నిర్వహిస్తున్న ప్రభుత్వ దళాలు

లటాకియా : సిరియా తీర ప్రాంతంలో ప్రభుత్వ భద్రతా దళాలకూ, మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మద్దతు నిచ్చే సాయుధుల మధ్య శుక్రవారం జరిగిన ఘర్షణలలో 70 మందికి పైగా మరణించారు. అసద్‌కు మద్దతునిచ్చే ప్రాంతాలైన లాటాకియా, టార్టస్ తదితర నగరాలకు, ఆసుపత్రి ప్రాంతాలకు సిరియా ప్రభుత్వం భారీగా బలగాలను పంపింది. అసాద్ డిసెంబర్‌లో పదవీచ్యుతుడైన తరువాత ఇస్లామిస్ట్ హయత్ తహ్రీర్ అల్-షామ్ (హెచ్‌టిఎస్) నేతృత్వంలోని తిరుగుబాటు సమూహాలు అధికారం చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆ తరువాత జరిగిన తీవ్రమైన ఘర్షణలివే. బ్రిటన్ ఆధారిత సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ (యుద్ధ పరిశీలక సంస్థ) అందించిన వివరాల ప్రకారం, గురువారం మధ్యాహ్నం నుండి ప్రారంభమైన ఘర్షణలలో 35 మంది ప్రభుత్వ బలగాల సభ్యులు, 32 మంది అసద్ మద్దతుదారులు, నలుగురు పౌరులు మరణించారు. తీర ప్రాంత పట్టణాలైన బానియాస్, జబ్లేహ్ పరిసర ప్రాంతాలు ఇప్పటికీ అసద్ మద్దతుదారుల నియంత్రణలో ఉన్నాయని అబ్జర్వేటరీ ప్రధాన కార్యదర్శి రమీ అబ్దుర్రహ్మాన్ తెలిపారు. అసద్ స్వగ్రామం కర్దహా, దాని చుట్టుపక్కల ఉన్న అనేక అలావైట్ గ్రామాలు కూడా ప్రభుత్వ నియంత్రణకు వెలుపల ఉన్నాయని ఆయన చెప్పారు. పరిస్థితి చాలా దుర్భరంగా ఉందని, కర్దహాలోని నివాస ప్రాంతాలపై భారీ మెషిన్ గన్లతో గురిపెడుతున్నారని కర్దహా ప్రాంతానికి చెందిన పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ వ్యక్తి తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుంచి ఫైరింగ్ జరుగుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నామని చెప్పారు. జబ్లేహ్ సమీపంలో ఒక వ్యక్తిని అరెస్టు చేయడానికి భద్రతా దళాలు ప్రయత్నించడంతో పరస్పర దాడులు జరిగాయని అబ్దుర్ రహమాన్ తెలిపారు. 2011 నుంచి సిరియాలో సాగుతున్న ఘర్షణల్లో ఐదు లక్షల మందికంటే ఎక్కువమంది మరణించారు.

భారీ టూరిజం ప్రాజెక్టులకు సర్వహక్కులతో భూమి!

(మొదటి పేజీ తరువాయి)

చోట రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపిబి) ద్వారా నేరుగా కేటాయించనున్నారని తెలిసింది. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను రేషనలైజేషన్ చేయాలనికూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ శాఖలు అని అజెండాలో అన్నప్పటికీ సచివాలయ ఉద్యోగులను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని భావిస్తున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ నుండి ఈ ప్రతిపాదనలు వచ్చినట్లు సమాచారం. మెరుగైన సేవలందించేందుకు జిల్లా పంచాయితీ అధికారులు, ఎక్సటెన్షన్ అధికారుల ఉద్యోగాలతోపాటు గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులను కూడా రేషనలైజేషన్ చేయాలని పేర్కొనట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఎక్కువగా దృష్టి పెట్టే ఆర్థికాభివృద్ధి మండలిలోనూ కొత్త ఉద్యోగాలను కల్పించేందుకు సాధారణ పరిపాలన శాఖ చేసిన ప్రతిపాదనలను కూడా మంత్రివర్గం ఆమోదించినట్లు తెలిసింది. ఈ మండలిలో కాంట్రాక్ట్ పద్ధతిన 22 కీలక పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు.

మరికొన్ని నిర్ణయాలు

గతంలో ఉన్న ఎపి ప్రయివేటు విశ్వవిద్యాలయాల బిల్లు (2016)ను సవరిస్తూ కొత్త బిల్లును కూడా మంత్రిమండలి ఆమోదించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంలో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్‌ను ఏర్పాటుచేసేందుకు, రాష్ట్ర ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమ శాఖలో సెంట్రల్ పూల్ విధానంలో 372 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, భర్తీ చేసేందుకు నిర్ణయించారు.

భూ కేటాయింపులు ...

.విజయనగరం జిల్లాలో టిడిపి కార్యాలయ నిర్మాణం కోసం ఎకరం భూమికి ఏడాదికి వెయ్యి రూపాయల లీజు వంతున రెండు ఎకరాల భూమిని కేటాయించాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపినట్లు తెలిసింది. హేవ్‌లాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేయడం కోసం రాజమహేంద్రవరంలోని 116.974 ఎకరాల భూమిని టూరిజం డిపార్ట్‌మెంట్‌కు కేటాయించారు. ఉచితంగానే ఈ కేటాయింపు చేసినట్లు సమాచారం. కాకినాడ రూరల్ మండలంలోని తమ్మవరం గ్రామ పరిధిలోని 66.12 ఎకరాల సముద్రతీర ప్రాంతాన్ని టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి కోసం టూరిజం డిపార్ట్‌మెంట్‌కు కేటాయింపు. ఈ భూమిని కూడా ఉచితంగానే కేటాయించారు.

సుధాభాస్కర్ పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సుధాభాస్కర్‌కు పితృవియోగం

- అనారోగ్యంతో ఆర్.జనార్ధన్ కన్నుమూత
- గాంధీ మెడికల్ కాలేజీకి పార్థీవదేహం అప్పగింత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్‌కు పితృవియోగం కలిగింది. ఒకప్పటి వెయిట్ లిఫ్టర్, ఎఐఐఇఎ మాజీ నేత రూపనగుంట జనార్ధన్ (93) ఇక లేరు. శుక్రవారం తెల్లవారుజామున 2:15 గంటలకు హైదరాబాద్‌లోని గాంధీనగర్‌లోని తన స్వగృహంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు సతీమణి ఆర్.ఇంద్రావతి, ఇద్దరు కుమారులు ఆర్.సుధాభాస్కర్, ఆర్.రఘు, కుమార్తె సరళ ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు ఆర్. సుధాభాస్కర్ నవతెలంగాణ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం భౌతికకాయాన్ని శుక్రవారం గాంధీ మెడికల్ కాలేజీకి కుటుంబసభ్యులు అప్పగించారు. గుంటూరు జిల్లాలో పేద కుటుంబంలో జనార్ధన్ జన్మించారు. ఆరుగురు సోదరులు, సోదరి ఉండటంతో చిన్నతనం నుంచే కుటుంబ బాధ్యతలను ఆయన తలకెత్తుకున్నారు. ఎస్ఎస్ఎల్‌సి వరకు విద్యనభ్యసించారు. గుంటూరులో జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు శ్రీహరిరావు వద్ద శిష్యరికం చేశారు. ఆ తర్వాత పలు రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్నారు. వ్యవసాయ శాఖలో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు డెమానిస్ట్రేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆంధ్రా ఇన్సూరెన్స్ కంపెనీలో చేరారు. జాతీయకరణ తర్వాత అది ఎల్ఐసిగా మారింది. మచిలీపట్నంలో వివేకానంద మందిరం అనే సంస్థ వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా కుల కట్టుబాట్లను తెంచేసి దళితుడి పాడె మోసి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారు. సుదీర్ఘ కాలం పాటు ఎఐఐఇఎలో కీలక పాత్ర పోషించారు.కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా సేవలందించి దాని విస్తరణలో కీలక భూమిక పోషించారు. భౌతికకాయానికి తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్కరాములు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, టి.సాగర్, జ్యోతి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, నవతెలంగాణ సిజిఎం పి.ప్రభాకర్ తదితరులు నివాళుల అర్పించారు. జనార్ధన్ మృతికి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ప్రజాశక్తి దినపత్రిక ఎడిటర్ తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వెటర్నరీ విద్యార్థుల పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)

స్టైఫండ్‌ను పెంచారని, ఒక్క పశువైద్య విద్యార్థులకు మాత్రం స్టైఫండ్‌ను పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ విద్యార్థులు నెలకు రూ.9,000 మాత్రమే అందుకుంటారని, పిహెచ్‌డి విద్యార్థులు నెలకు రూ.10,000 అందుకుంటున్నారని, ఇతర మెడికల్ అండర్ గ్రాడ్యుయేట్ ఇంటర్న్‌లు నెలకు రూ.20,000 కంటే ఎక్కువ అందుకుంటారని, మెడికల్ పిజి విద్యార్థులు నెలకు రూ.50,000 కంటే ఎక్కువ అందుకుంటారని తెలిపారు. తమకు స్టైఫండ్‌ను పెంచాలని డిమాండ్ చేస్తూ 32 రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నామని తెలిపారు. బిడిఎస్, హోమియోపతి, ఆయుర్వేద వంటి వైద్య కోర్సులతో సమానంగా వెటర్నరీ విద్యార్థులకు రూ.20 వేలు స్టైఫండ్‌ను పెంచాలని, పెరుగుతున్న మెస్ ఛార్జీలు, ధరలతో పాటు ప్రతి సంవత్సరం 15 శాతం చొప్పున స్టైఫండ్ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, త్రైమాసిక లేదా అర్థ సంవత్సరానికి కాకుండా ప్రతి నెలా విద్యార్థులకు స్టైఫండ్ మొత్తాన్ని క్రమం తప్పకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీలైనంత త్వరగా పశు వైద్య విద్యార్థులకు ఇతర వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచినట్లు జిఒ విడుదల చేయాలని, ప్రస్తుతం అవుట్ గోయింగ్ బ్యాచ్ 2020 సంవత్సరం విద్యార్థులకు కూడా స్టైఫండ్ పెంపును వెంటనే వర్తింపజేయాలని కోరారు.

న్యాయమైన డిమాండ్

మేము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చాలని కోరుతున్నాం. ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.
- పురుషోత్తం, వెటర్నరీ విద్యార్థి,తిరుపతి

సమస్యలను పరిష్కరించాలి

ప్రస్తుతం మన రాష్ట్రం పాల ఉత్పత్తిలో ఐదవ స్థానం, మాంసం ఉత్పత్తిలో రెండవ స్థానం, గుడ్లు ఉత్పత్తిలో మొదటి స్థానం లో ఉంది. అందులో పశు వైద్యులుగా వాటి ఉత్పత్తులు పెంచడంలో మా పాత్ర కీలకం. మా సమస్యలను తక్షణం పరిష్కరించాలి.
- డి.యుగంధర్ నాయక్, బివిఎస్‌సి ఫైనలియర్, ఎస్‌వియు, తిరుపతి.

వెటర్నరీ విద్యార్థుల సమస్యను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

వెటర్నరీ వైద్య విద్యార్థులకు స్టైఫండ్ రూ.25 వేలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కృష్ణా జిల్లా గన్నవరం వద్దనున్న విద్యార్థుల దీక్ష శిబిరాన్ని ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఏ అశోక్ సందర్శించి, మాట్లాడారు. స్టైఫండ్ రూ.ఏడు వేలు ఇవ్వడమే ఎక్కువని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఓఎస్‌డి పోలినాయుడు విద్యార్థులతో చెప్పడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒరిస్సా రూ.14 వేలు, కేరళ రూ.17 వేలు చొప్పున స్టైఫండ్ చెల్లిస్తున్నాయని, రాష్ట్రంలో ఈ సమస్యను పరిష్కరించకపోతే ఉధృత పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కోస్తాలో నేటి నుంచి పి-4 సర్వే

(మొదటి పేజీ తరువాయి)

ఇల్లు, నాలుగు చక్రాల వాహనం ఉండకూడదని అద్దె, వడ్డీ, పింఛన్లు పొందుతున్న వారు ఈ సర్వేకు అనర్హులుగా తేల్చారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పది ఎకరాల కన్నా తక్కువ సాగు భూమి ఉండవచ్చునని, వెయ్యి అడుగుల కన్నా తక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉండవచ్చునని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. నిరుపేదలుగా పేర్కొన్న వారిలో విద్యుత్ కనెక్షన్లు లేని వారు, తాగునీటి ట్యాప్ లేని వారు, బ్యాంకు ఖాతా లేనివారు, టివి, ఫ్రిజ్, ఎసి, ల్యాప్‌ట్యాప్, పక్కా గృహం లేనివారిని గుర్తిస్తారు. సర్వేను మొబైల్ యాప్ ద్వారా నిర్వహిస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు, కుటుంబాల్లో మృతి చెందిన వారి వివరాలను నమోదు చేయరు. ఇంటిలో ఎంత మంది సంపాదిస్తారు? వారి ఆదాయం, ఏదైనా ఫించన్లు పొందుతున్నారా? వీటి వివరాలు, బ్యాంకు ఖాతా నెంబరు, సొంత ఆస్తి వివరాలు, టూ వీలర్ వివరాలు, విద్యుత్ కనెక్షన్లు వివరాలు, ట్యాప్ కనెక్షను, రోజుకు తాగునీరు ఎంత సేపు వస్తుంది, ఎన్ని రోజులకు వస్తుంది? వివరాలతో పాటు మొత్తం 27 ప్రశ్నలకు జవాబులు నింపాలని సర్వే ఉద్యోగులకు సూచించారు. ఆయా కుటుంబంలో ఒకరి నుంచి బయోమెట్రిక్ లేదా ఫోన్ ఓటిపి ద్వారా సర్వే చేపడతారు. పేరు, ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు ఆధారంగా మిగతా వివరాలు నమోదు చేస్తారు.

పునర్విభజన ప్రక్రియపై సమైక్య పోరు!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వర్తించిన రాష్ట్రాలపై ఒక ఆయుధంగా ఉపయోగించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. సమస్య తీవ్రంగా వున్నప్పటికీ దాన్ని పట్టించుకోకుండా కేంద్రం స్పష్టతను ఇవ్వడంలో విఫలమవుతోందని విమర్శించారు. ప్రొ రేటా ప్రాతిపదికను అనుసరిస్తామని చాలా అస్పష్టంగా చెబుతున్నారని ఆ ప్రొ రేటాను లెక్కించడానికి ఉపయోగించే ప్రాతిపదిక ఏమిటనేది వివరించడం లేదని విమర్శించారు. మన ప్రజాస్వామ్యమే ముప్పులో పడుతున్నప్పుడు ఇటువంటి అస్పష్టమైన హామీలను మనం ఆమోదించగలమా? అని ఆయన ఆ లేఖలో ప్రశ్నించారు. కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, పంజాబ్ సిఎంలకు ఆయన లేఖ రాశారు. ప్రతిఘటనా పోరాటాన్ని సమన్వయం చేసేందుకు సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి)ని ఏర్పాటు చేయడంలో చేతులు కలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సవాలు యొక్క రాజ్యాంగ, చట్టబద్ధమైన, రాజకీయ పార్శ్వాలను మనందరం కలిసికట్టుగా పరిశీలించాల్సి వుందన్నారు. అప్పుడు మాత్రమే మన ప్రస్తుత ప్రాతినిధ్య స్థాయిపై రాజీపడకుండా జాతి నిర్మాణంలో మన పాత్రను గౌరవించేలా పునర్విభజన ప్రక్రియను సాధించుకోగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

सत्यमेव जयते
Government of India

గత 11 సంవత్సరాల్లో...

- జనన సమయంలో లింగ నిష్పత్తి 918 నుంచి 933 కి పెరిగింది.
- విజ్ఞాన శాస్త్రాలు, సాంకేతికత, ఇంజినీరింగ్, గణితాల్లో (స్టెమ్) దాదాపు సగం అడ్మిషన్లు మహిళలవే.
- సైనిక పాఠశాలలు, ఎన్‌డిఏ లలో బాలికలకు ప్రవేశం
- సాయుధ బలగాల్లో మహిళలకు శాశ్వత నియామకాలు
- 48% కాన్న ఎకువ అంకుర సంస్థల్లో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్నారు.
- ముద్ర యోజనలో దాదాపు 70% మంది లబ్ధిదారులు మహిళలే
- 10 కోట్లకు పైగా గ్రామీణ మహిళలు స్వయం సహాయక బృందాల్లో సభ్యులే
- ప్రసూతి సెలవులు 12 వారాల నుంచి 26 వారాలకు పంపు
- ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద 3.7 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.16,500 కోట్లను ప్రభుత్వం అందించింది.
- 74% ప్రధానమంత్రి ఆవాస యోజన గృహాలకు మహిళలే యజమానులు
- 10 కోట్లకు పైగా గృహాల్లో ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు
- 15 కోట్లకు పైగా గృహాల్లో నల్ సే జల్ కనెక్షన్లు ఉన్నాయి.
- దాదాపు 12 కోట్ల టాయిలెట్ల నిర్మాణం
- ట్రిపుల్ తలాక్ రద్దు
- ముస్లిం మహిళలు హజ్ యాత్రకు ఒంటరిగా వెళ్లవచ్చు

ఆమె సాధికారత కల్గిస్తుంది, ఆమె నడిపిస్తుంది, ఆమె స్ఫూర్తినిస్తుంది

మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్నా... ఈరోజు – ప్రతి రోజూ!

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

CBC 46101/13/0012/2425

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68